APTEL 2009/31957



వెన్నాడుతున్న కెసిఆర్ పాలనా వైఫల్యాలు 2 లో..

# నీలగిరి వార్త

మన కోసం మన వార్త తెలుగు దినపత్రిక
neelagirivartha@gmail.com



రామోజీ ఫిల్మ్‌సిటీలో శ్రీమద్భాగవతం చిత్రీకరణ 2 లో..

ఏపీ & తెలంగాణ | ఎడిటర్ : గుంటోజు విష్ణుమూర్తి | మంగళవారం | 15- 07- 2025 | సంపుటి : 15 | సంచిక : 334 | పేజీలు : 12 | వెల : 5/- | అసోసియేట్ ఎడిటర్ : చెన్నూరి అన్వేషి

# పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు

- పేదలకు సన్నబియ్యం ఊసే ఎత్తలే
- కొత్తగా 3. 58 లక్షల రేషన్ కార్డుల పంపిణీ
- కొత్త రేషన్ కార్డుల ద్వారా 11.3 లక్షల మందికి లబ్ధి
- బీఆర్ఎస్ హయాంలో బెల్ట్ షాపులకే ప్రాధాన్యం
- రైతులకు రుణమాఫీ...బోనస్ ఇచ్చిన ఘనత మాది
- కెసిఆర్ కట్టిన కాళేశ్వరం..కూలేశ్వరంగా మారింది
- ఇందుకు వారిని అక్కడే ఉరితీసినా నష్టం లేదు
- నల్లగొండ జిల్లా తిరుమలగిరిలో రేషన్ కార్డుల పంపిణీ
- బిఆర్ఎస్ తీరుపై ఘాటు విమర్శలు చేసిన సిఎం రేవంత్



**నల్గొండ- నీలగిరివార్త :**
బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో ఒక్కరికి కూడా రేషన్ కార్డు ఇవ్వ లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శిం చారు. పేదవాడికి సన్న బియ్యం ఇచ్చి.. గుక్కెడు ముద్ద పెట్టాలని ఆలోచన సైతం గత ప్రభుత్వంలోని పెద్దలు చేయలేదని మండిపడ్డారు. సోమవారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరిలో రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి లాంఛ నంగా ప్రారంభించారు. అలాగే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఆయన.. రూ. 34. 20 కోట్ల విలువైన పనులు సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిం చారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాతో కాం గ్రెస్ పార్టీకి విడదీయరాని బంధం ఉం దని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి అన్నా రు. రేషన్ కార్డు పేదవాడి ఆత్మగౌరవం గుర్తింపు అన్నారు. ఆకలి తీర్చే ఆయుధ మని తెలిపారు. తెలంగాణలో కొత్తగా 3.58 లక్షల రేషన్‌కార్డుల పంపిణీ చేస్తు న్నట్లు వివరించారు. కొత్త రేషన్ కార్డుల ద్వారా 11.3 లక్షల మందికి

మిగతా 2వ పేజీలో..



# కాలం కాదు.. కాంగ్రెస్.. కాటేస్తోంది..

- కాళేశ్వరం ఎత్తిపోతలపై తీవ్ర నిర్లక్ష్యం
- రైతులు ప్రశ్నిస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం
- ఎక్స్ వేదికగా కెటిఆర్ ఘాట విమర్శలు

**హైదరాబాద్- నీలగిరివార్త :**
కాళేశ్వరం నీళ్లను ఎత్తిపోయకుండా చేసిన సర్కార్ నిర్లక్ష్యం వల్ల కాలువల్లో నీళ్లకు బదులు రైతుల కన్నీళ్లు పారుతున్నాయని బిఆర్ఎస్ నేత కెటిఆర్ మండిపడ్డారు. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో వ్యవసా యాన్ని దండగ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో వచ్చిన నీళు ౹.. కాంగ్రెస్ పాలనలో ఎందుకు రావడం లేదని రైతులే ప్రశ్నిస్తున్నారన్నారు. రైతు లకు కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరా డుతుందని కేటీఆర్ ట్వీట్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై మరోసారి కేటీఆర్ ఫైర్ అయ్యారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా మాజీ మంత్రి స్పందిస్తూ.. 'కాలం కాటేయడం లేదు.. కాంగ్రెస్ ప్రభుత్వం కాటేస్తున్నది. కరువు కాటేయడం లేదు.. కాలువల్లో నీళ్లు వారించకుండా కాంగ్రెస్ కాటేస్తున్నది. కాళేశ్వరం నీళ్లను ఎత్తిపోయకుండా కక్ష గట్టిన సర్కార్ నిర్లక్ష్యం మూలంగా కాలు వల్లో నీళ్లకు బదులు రైతుల కన్నీళ్లు పారు తున్నాయి. అద్దాలమేడలో ఊరేగుతున్న అబద్ధాల కాంగ్రెస్ మూలంగా అంధకారం లో తెలంగాణ రైతన్న ఆందోళన చెందు తున్నాడు. దశాబ్దాల పాలనలో దండగ చేసిన వ్యవసాయాన్ని దశాబ్ద బీఆర్ఎస్ పాలనలో పండగ చేస్తే ఏడాదిన్నర కాం గ్రెస్ పాలనలో తిరిగి దండగ చేశారు. కానీ పండగల పేరుతో కాంగ్రెస్ ప్రభు త్వం ఊరేగుతున్నది. బీఆర్ఎస్ పాలనలో వచ్చిన కాళేశ్వరం నీళ్లు.. కాంగ్రెస్ పాల నలో ఎందుకు రావడం

మిగతా 2వ పేజీలో..

# జల వివాదంపై కేంద్రం చొరవ

- ఇరు రాష్ట్రాల సిఎంలతో 16న పాటిల్ భేటీ
- చంద్రబాబు,రేవంత్ రెడ్డికి ఆహ్వానం
- నేడు ఢిల్లీ వెళ్లనున్న ఎపి సిఎం చంద్రబాబు



## కృష్ణా, గోదావరి జలాల్లో వాటాకు పట్టు 2 లో..

- 16న జరిగే సమావేశంపై కసరత్తు

**న్యూఢిల్లీ- నీలగిరివార్త :**
ఇరు తెలుగు రాష్ట్రాల మధ్య ఉన్న జల వివాదంపై చర్చకు తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీకి కేంద్రం ఏర్పాట్లు చేసింది. ఈ నెల 16న ఢిల్లీలో కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం కావాలని కేంద్రం కోరింది. ఈ మేరకు వీరిద్దరిని ఆహ్వా నిస్తూ కేంద్ర జల్‌శక్తి శాఖ సర్క్యులర్ విడుదల చేసింది. ఈ భేటీకి హాజరయ్యేం దుకు ఇద్దరు సీఎంలకు వీలవుతుందో లేదో తెలపాలని పేర్కొంది. మరోవైపు కృష్ణా, గోదావరి వాటాల సాధనకు కేం ద్రంపై ఒత్తిడి తేవాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. కృష్ణాపై రాష్ట్రం లోని ప్రాజెక్టులకు క్లియరెన్స్ ఇవ్వాలని, నీటి కేటాయింపులు, ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయాలని కేంద్రాన్ని సీఎం కోర నున్నారు. చంద్రబాబు బనకచర్ల ప్రతిపా దనలతో గోదావరి జలాలపై రచ్చ సాగు తోంది. ఈ క్రమంలో కేంద్రం ఈ భేటీ ఏర్పాటుచేయడం గమనార్హం. అయితే రేవంత్ ఢిల్లీ వెళతారా లేదా అన్నది ఇం కా తెలియాల్సి ఉంది. ఇకపోతే ఏపీ సీఎం చంద్రబాబు మంగళవారం

మిగతా 2వ పేజీలో..

# రాజకీయ చదరంగంలో బీసీ వర్గాలు పావులేనా?

- పార్టీలు విమర్శలు,ప్రతివిమర్శలతో రాజకీయ పబ్బం గడుపుకుంటారా?
- తెలంగాణలో హాట్ టాపిక్‌గా మారిన స్థానిక సంస్థల ఎన్నికలరిజర్వేషన్స్?
- 42 శాతం రిజర్వేషన్లకు అడ్డంకెవరు? బీసీ ప్రజల అనైక్యత ప్రధానకారణమా!
- రాష్టంలో ప్రధాన రాజకీయ పార్టీల చిత్తశుద్ధిపై ప్రజల్లో అనుమానం!
- ఎన్నికల్లో హామీలు తప్ప అమలెక్కడ? బీసీలు మందెక్కువే మజ్జిగ పలుచన?
- కులగణన చేపట్టి జనాభా 56.33 శాతంగా అసెంబ్లీలో బిల్లు ఆమోదం?
- 42 శాతం రిజర్వేషన్ల అమలుపైన విపక్ష రాజకీయ పార్టీల మద్ధతు




**(ప్రత్యేక ప్రతినిధి - నీలగిరివార్త) :**
రాజకీయ చదరంగంలో బీసీ తీసుకునేం దుకు అవకాశం ఉంటుందంటున్నారు. కానీ, ఇప్పటికే అధికార కాంగ్రెస్ పార్టీ కేబినేట్ నిర్ణయం తీసుకుంటే మిగిలిన పక్షాలు సన్నాయి నొక్కులు నొక్కుతున్నా యి. తమ నాయకత్వాల పై ఒత్తిడి తెచ్చి బీసీలకు చట్టబద్ధ అవకాశాలు కల్పించి ఆయా పార్టీల్లో బీసీ నాయకులుగా తమ గౌరవాన్ని, బీసీల గౌరవాన్ని కాపాడుదా మనే సానుకూల దృక్పథం కంటే ఈ తంతును ఉపయోగించుకునే బీసీలను తమ ఓటు బ్యాంకుగా మార్చుకుంటూ ప్రత్యర్థిపార్టీని ఇరుకున పెట్టే ప్రయత్నా లు సాగుతున్నాయి. బీసీ సమూహం వీరికి కర్రుకాల్చివాత పెట్టాలని బీసీ సం ఘాల నాయకులు కొందరు ఇప్పటికే విన్నవిస్తున్నారు. తెలంగాణలో హాట్ టాపిక్‌గా మారిన స్థానిక సంస్థల ఎన్ని కల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలు ఆశగానేమిగిలిపోతుందా?

మిగతా 2వ పేజీలో..



## చీఫ్ జస్టిస్ గవాయ్‌కు స్వల్ప అస్వస్థత

- ఢిల్లీలోని ఆస్పత్రిలో చేరిక

**న్యూఢిల్లీ- నీలగిరివార్త :**
సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూ ర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. దీంతో వెంటనే అతడిని ఆస్పత్రిలో చేర్చా రు. తీవ్ర ఇన్ఫెక్షన్ కారణంగా ఢిల్లీ లోని ఓ ఆస్పత్రిలో చేరినట్లు అధి కారిక వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ఆయన చికిత్సకు స్పంది స్తున్నట్లు తెలిపాయి. ఒకటి,రెండు రోజుల్లో విధులకు

మిగతా 2వ పేజీలో..



## గోవా గవర్నర్‌గా అశోకగజపతి రాజు

- కొత్తగా ముగ్గురు గవర్నర్ల నియామకం
- ఉత్తర్వులు జారీచేసిన రాష్ట్రపతి ముర్ము
- ముగిసిన హర్యానా గవర్నర్ దత్తాత్రేయ పదవీకాలం

**న్యూఢిల్లీ- నీలగిరివార్త :**
రాష్ట్రపతి ద్రౌపదీముర్ము మూడు రాష్ట్రాలకు నూతన గవర్నర్లను నియమించారు. గోవా గవర్నర్ గా తెదేపా సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతి రాజు

మిగతా 2వ పేజీలో..

# నింగికేసి రైతుల చూపు!

**ప్రత్యేకప్రతినిధి - నీలగిరివార్త :**
ఈ ఖరీఫ్ సీజన్ లో ముందుగా రుతుపవనాలు ప్రారంభమైనప్పటికీ ఆశించిన స్థాయి వర్షాలు కురవక పోవడంతో తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటి వరకు పంట సగం సాగు లక్ష్యాన్ని మాత్రమే చేరుకుంది. ఈ నెల మొదటి వారానికి రాష్ట్ర వ్యాప్తంగా 57,02,011 ఎక రాల్లో మాత్రమే వివిధ రకాల పంటల సాగు ప్రారం భమైంది. ఈ ఖరీఫ్ సీజన్ లో సాధారణ సాగు లక్ష్యం 1,32,44,305 ఎకరాలు ఉండగా సగం మాత్రమే సాధ్యమైంది వర్షాలు కురువకపోవడంతో పంట సాగు జాప్యమవుతోంది. గత ఏడాది ఈ సమయంతో పోల్చితే లక్ష్యాన్ని అధిగమించారు. గత ఏడాది ఈ సమయానికి 56,19,751 ఎకరాల్లో సాగు చేయగా ఈ సీజన్‌లో లక్ష్యాన్ని 56,26,243 ఎకరాలుగా నిర్దేశించుకోగా ఆ లక్ష్యం మాత్రం అధిగమించారు. గత ఖరీఫ్‌తో పోల్చితే లోటువర్షపాతం నమోదుకావడంతో అనుమానాలు తలెత్తుతున్నాయి. ఆశచావని అన్నదాతలు

మిగతా 2వ పేజీలో..

- రైతన్నతో వరుణుడి దోబూచులాట
- సాగు లక్ష్యం ఇప్పటికి ఇంకా సగమే!
- 23 జిల్లాలో సాధారణ వర్షపాతం
- 10 జిల్లాలో తక్కువ వర్షపాతం
- రైతులు ప్రతీ ఏడాది మాదిరిగానే
- సాగులో వరి, పత్తిపైనే ఆసక్తి
- వర్షాభావంతో జొన్న, మొక్కజొన్న వైపు మొగ్గు





## తెలంగాణ హైకోర్టు సిజెగా జస్టిస్ ఆపరేష్ కుమార్ సింగ్

- కొలీజియం సిఫార్సులతో రాష్ట్రపతి ముర్ము ఉత్తర్వులు

**న్యూఢిల్లీ- నీలగిరివార్త :**
తెలంగాణ రాష్ట్ర హైకోర్టుకు కొత్త ప్రధాన న్యాయమూర్తిని కేంద్ర ప్రభుత్వం నియమించింది. ప్రసు ్తతం త్రిపుర హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా సేవలందిస్తున్న జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్‌ను తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేశా రు. కొలిజియం చేసిన సిఫార్సును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

మిగతా 2వ పేజీలో..

## కృష్ణా, గోదావరి జలాల్లో వాటాకు పట్టు

**16న జరిగే సమావేశంపై కసరత్తు**

**హైదరాబాద్- నీలగిరివార్త :** కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన ప్రతి నీటిబొట్టును సద్వినియోగం చేసుకోవాలని, న్యాయపరంగా రావాల్సిన నీటి వాటాల సాధనకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నిర్ణయించారు. కృష్ణాపై తెలంగాణలో ఉన్న ప్రాజెక్టులకు వెంటనే క్లియరెన్స్ ఇవ్వాలని, నీటి కేటాయింపులతో పాటు ప్రాజెక్టుల నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరనున్నారు. కృష్ణాతో పాటు గోదావరి జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించుకోవటంతో పాటు, ఇంతకాలం జరిగిన అన్యాయానికి శాశ్వతమైన పరిష్కారాలను సాధించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆయన సూచనలతో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర జల వనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్ కు లేఖ రాశారు. ఈనెల 16న ఢిల్లీలో కేంద్ర జల శక్తి మంత్రితో సమావేశమై తెలంగాణ నీటి వాటాల సాధనతో పాటు-, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులు, నీటి కేటాయింపులు, కొత్త ప్రాజెక్టులకు పట్టుబట్టాలని నిర్ణయించారు.

## రామోజీ ఫిల్మ్‌సిటీలో శ్రీమద్భాగవతం చిత్రీకరణ

**ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన సీఎం రేవంత్**

**హైదరాబాద్- నీలగిరివార్త :**

రామాయణం, మహాభారతం మన జీవితాల్లో భాగమని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో 'శ్రీమద్భాగవతం- పార్ట్1' చిత్రీకరణ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సీఎం హాజరయ్యారు. సాగర్ పిక్చర్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ దీన్ని రూపొందిస్తోంది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో శ్రీమద్భాగవతం చిత్రీకరణ రాష్ట్రానికి గర్వకారణం. రామోజీరావు ఫిల్మ్‌సిటీ-ని అద్భుతంగా నిర్మించారు.నేను యూనివర్సల్ స్టూడియో చూడలేదు. రామోజీ ఫిల్మ్‌సిటీ.. దేశంలోనే ప్రత్యేకమైన స్టూడియో. ఇది తెలంగాణలో ఉందని చెప్పేందుకు గర్విస్తున్నా. శ్రీమద్భాగవతం సినిమా తీయాలన్న ఆలోచన వచ్చినందుకు మూవీ టీమ్‌ను అభినందిస్తున్నా. నలభయేళ్ల క్రితం రామాయణం సీరియల్ అందరికీ చేరువైంది. కొవిడ్ సమయంలో మళ్లీ ఆ సీరియన్‌ను టెలికాస్ట్ చేస్తే ప్రపంచ రికార్డు సృష్టించింది. 2035లోపు తెలంగాణను 1 ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దాలని మేం సంకల్పించాం. 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమీగా ఉండేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. దీనికోసం 2047 విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేసుకుంటున్నాం. ఇందులో సినీ రంగానికి ప్రత్యేక చాప్టర్ ఉంటుంది. నాడు రామానంద్ సాగర్ తీసిన రామాయణం సీరియల్ ఎంత పాపులర్ అయిందో.. 'శ్రీమద్భాగవతం పార్ట్-1' కూడా అంత హిట్ అవ్వాలని కోరుకుంటున్నట్లు రేవంత్‌రెడ్డి అన్నారు.

## గోవా గవర్నర్‌గా అశోకగజపతి రాజు

మొదటిపేజీ తరువాయి..

నియమితులయ్యారు. హరియాణా గవర్నర్‌గా ప్రొఫెసర్ ఆషిమ్‌కుమార్ ఘోష్, లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా కవీందర్ గుప్తాను నియమించారు. హర్యానా గవర్నర్‌గా ఉన్న బండారు దత్తాత్రేయ పదవీకాలం ముగియడంతో ఆయన స్థానంలో ప్రొఫెసర్ ఆషిమ్ కుమార్ ఘోష్ నియమితులయ్యారు. అలాగే తెలుగు రాష్ట్రానికి చెందిన గజపతి రాజు గోవా గవర్నర్‌గా నియమితులు కావడం విశేషం. ఈ మేరకు రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు హరియాణా గవర్నర్‌గా పనిచేసిన బండారు దత్తాత్రేయ పదవీకాలం ముగిసింది. అలాగే మహారాష్ట్ర గవర్నర్‌గా పనిచేసిన విద్యాసాగర్ రావు పదవీకాలం కూడా గతంలోనే ముగిసింది. ఆయనకు మళ్లీ పొడగింపు ఇవ్వలేదు. ఇప్పుడు దత్తాత్రేయకు కూడా పొడగింపు లేదని స్పష్టమయ్యింది.

## చీఫ్ జస్టిస్ గవాయ్‌కు స్వల్ప అస్వస్థత

మొదటిపేజీ తరువాయి..

హాజరవుతారని పేర్కొన్నాయి. 12న హైదరాబాద్‌లోని నల్సార్ న్యాయ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో జస్టియ్ గవాయ్ పాల్గొన్నారు. ఆ తర్వాతే ఇన్ఫెక్షన్ బారిన పడినట్లు తెలుస్తోంది. అదే రోజు ఉస్మానియా విశ్వవిద్యాలయం ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించిన ' భారత రాజ్యాంగ రూపకల్పనలో అంబేడ్కర్' అనే అంశంపై జస్టిస్ గవాయ్ ప్రసంగం చేశారు. బాబాసాహెబ్ అంబేడ్కర్ -రాజ్యాంగ సభ- భారత రాజ్యాంగం' పేరిట పోస్టల్ కవర్‌ను విడుదల చేశారు. అక్కడి నుంచి ఢిల్లీ చేరుకున్నారు.

## హైకోర్టు సిజెగా జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్

మొదటిపేజీ తరువాయి..

ఆమోదించడంతో ఈ బదిలీ అమలులోకి వచ్చింది. సోమవారం విడుదల చేసిన కేంద్ర నోటిఫికేషన్ ప్రకారం నాలుగు రాష్ట్రాల హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల బదిలీలు జరిగాయి. అందులో భాగంగా త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్‌ను తెలంగాణ హైకోర్టుకు నియమించారు. జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్‌కు ఇది ఒక కీలక బాధ్యత. 2023 ఏప్రిల్ 11న ఆయన త్రిపుర హైకోర్టు సీఎంజేగా నియమితులయ్యారు. ఆయనకు పుట్టిన కోర్టుగా జార్ఖండ్ హైకోర్టు గుర్తింపు ఉంది. న్యాయరంగంలో ఆయనకు ఉన్న అనుభవం, తీర్పుల్లో ఆయన చూపిన నిష్పక్షపాతత, న్యాయశాస్త్రంపై గల లోతైన అవగాహన తెలంగాణ న్యాయవ్యవస్థకు తోడ్పాటు-ను అందించనుందని న్యాయవర్గాలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నాయి.

## మతపరమైన రిజర్వేషన్లకు వ్యతిరేకం: బిజెపి

**నల్లగొండ- నీలగిరివార్త :** మతపరమైన రిజర్వేషన్లకు వ్యతిరేకం అని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు స్పష్టం చేశారు. బిసి రిజర్వేషన్లలో ముస్లింలనుచేర్చడాన్ని అంగీకరించబోమన్నారు. భారత్‌లోనే కాకుండా ఉమ్మడి నల్గొండ జిల్లాలో కుటుంబ పాలన నడుస్తోందని రామచందర్ రావు ఆరోపించారు. కుటుంబ పాలనను పారదోలి మోదీ డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తున్నదని ధీమా వ్యక్తం చేశారు.మొదట యాదాద్రి భువనగిరిజిల్లాలోని చౌటుప్పల్ వెళ్లారు. అనంతరం ఉమ్మడి నల్గొండ జిల్లాలో పర్యటించారు. బీసీల 42 శాతం రిజర్వేషన్లకు తను వ్యతిరేకం కాదని, మత పరమైన రిజర్వేషన్లకు మాత్రమే వ్యతిరేకమని రామచందర్ రావు అన్నారు.

## బిసి రిజర్వేషన్లకు కేంద్రంపై ఒత్తడి తెండి

**బిజెపి నేతలకు మంత్రి పొన్నం డిమాండ్**

**హైదరాబాద్- నీలగిరివార్త :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును కేంద్రం ఎందుకు ఆమోదించడంలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. కేంద్ర నాయకత్వాన్ని ఒప్పించాల్సిన బాధ్యత రాష్ట్ర భాజపా నేతలపై ఉందన్నారు. రాష్ట్రపతితో ఆమోదింపజేసి.. 9వ షెడ్యూల్‌లో చేర్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మంత్రివర్గం లేదా అఖిలపక్షం దిల్లీకి వచ్చేందుకు సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. భారత రాష్ట్ర సమితి, భాజపాలో ఉన్న బీసీ నేతలు వాళ్ల అధిష్ఠానంపై ఒత్తిడి పెంచాలన్నారు.

# వెన్నాడుతున్న కెసిఆర్ పాలనా వైఫల్యాలు

- ఎపి ప్రాజెక్టులను పట్టించుకోకుండా ఇప్పుడు విమర్శలు
- వ్యవసాయారంగాన్ని అభివృద్ధి చేయడం కాంగ్రెస్ లక్ష్యం
- పాలేర్ రిజర్వాయర్ నీటిని విడుదల చేసిన భట్టి,పొంగులేటి



**ఖమ్మం- నీలగిరివార్త :**

కేసీఆర్ పాలనలో చేసిన తప్పిదాలకు నేడు తమ ప్రభుత్వం మూల్యం చెల్లిస్తోందని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గతంలో శ్రీశైలంపైన ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టులు కడుతుంటే అడ్డుకోకుండా కేసీఆర్ ప్రభుత్వం సహకరించిందని మండిపడ్డారు. ఆనాడు కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రాజెక్టుల నిర్మాణానికి వ్యతిరేకంగా పోరాటాలు చేశామని గుర్తుచేశారు. ఆనాడు కేసీఆర్, హరీష్‌రావు, కేటీఆర్ తప్పులు చేసి వాటిని ఇప్పుడు తమపై రుద్దాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని అన్నారు. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసి కాపాడుకుంటామని భట్టి విక్రమార్క ఉద్ఘాటించారు. కాంగ్రెస్ అంటేనే వ్యవసాయం, కరెంట్, ప్రాజెక్టులు అని అభివర్ణించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయం, రైతులకు అండగా నిలిచిందని చెప్పారు. సోమవారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరు రిజర్వాయర్ నుంచి సాగర్ నీటిని డిప్యూటీ- సీఎం మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విడుదల చేశారు. జిల్లాలో 2.50లక్షల ఎకరాలకు పాలేరు రిజర్వాయర్ నుంచి 1500 క్యూసెక్కుల సాగు నీటిని రెండో జోనుకు మంత్రులు విడుదల చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. ఇవాళ సాగర్ రెండో జోన్‌కు సాగు నీరు విడుదల చేశామని తెలిపారు.గత కేసీఆర్ ప్రభుత్వ నిర్ణయాలు తెలంగాణ రాష్ట్రానికి భారంగా మారాయని ఆరోపించారు. రైతులు పండించిన పంటకు పెట్టు-బడిగా రైతు భరోసా, రూ.9 వేల కోట్లు- ఇచ్చామని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వంలో సన్నవడ్లకు బోనస్ ఇచ్చామని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడలేదని భట్టి విక్రమార్కమండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే.. వ్యవసాయం, కరెంటు, ప్రాజెక్టులు అని అన్నారు. ఎపి ప్రభుత్వం ప్రాజెక్టులు కడుతుంటే..మాజీ సిఎం కెసిఆర్ పట్టించుకోలేదని విమర్శించారు. ఆనాడు తప్పిదాలు చేసిందంటే కెసిఆర్, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రి హరీష్ రావు అని తెలియజేశారు. తప్పులు చేసిన బిఆర్ఎస్ నేతలు ఇప్పుడు తమపై దుష్ప్రచారం చేస్తున్నారని భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉద్ఘాటించారు. 2,55,324 లక్షల ఎకరాలకు సాగునీటిని విడుదల చేశామని తెలిపారు. గత ఏడాది కనీవినీ ఎరుగని వరదల కారణంగా సాగర్ మెయిన్ కెనాల్ పూర్తిగా కొట్టుకుపోయిందని.. దానిని పునరుద్ధరించామని తెలిపారు. నాగార్జున సాగర్ ఆయకట్టుకు పూర్తి స్థాయిలో సాగునీరు విడుదల చేస్తామని స్పష్టం చేశారు. కృష్ణా బేసిన్‌లో వచ్చే నీటితో మొదటి పంటకు ఎలాంటి ఢోకా లేదని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వరుణ దేవుడి అండ ఉందని.. ఇది శుభసూచకమని అన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పచేసినా.. తమ ప్రభుత్వంలో రైతులకు అండగా నిలబడ్డామని నొక్కిచెప్పారు. తొమ్మిది రోజుల్లో రూ. 9 వేల కోట్లు అన్నదాతల ఖాతాలో వేశామని స్పష్టం చేశారు. రైతును రాజు చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉద్ఘాటించారు. ప్రస్తుతం 400 క్యూసెక్కుల నీరు విడుదల చేశామని అన్నారు. రాబోయే 5 రోజుల్లో పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరువిడుదల చేస్తామని తెలియజేశారు. ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా రైతు పథకాలు అమలు చేస్తున్నామని, రైతుభరోసా రైతులకు ఎకరాలకు రూ.12 వేలు అందించామని, రైతుల ఖాతాల్లో 9 రోజుల్లో రూ. 9 వేల కోట్లు- జమ చేశామని చెప్పారు. సన్న ధాన్యానికి క్వింటాళ్లకు రూ. 500 బోనస్ ఇస్తున్నామని, రాబోయే రోజుల్లో మిగిలిన పంటలకు కూడా బోనస్ ఇస్తామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

# పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు

మొదటిపేజీ తరువాయి..

లబ్ధి చేకూర తుందన్నారు. తెలంగాణలో మొత్తం 95. 56 లక్షల మంది రేషన్ కార్డులు అందుకున్నారని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి విపులీకరించారు. నల్గొండ చరిత్రే.. తెలంగాణ చరిత్ర అని కొనియాడారు. జిల్లా అభివృద్ధి అంతా కాంగ్రెస్ హయాంలోనే జరిగిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో రేషన్ షాపులు తెరవలేదని.. బెల్ట్ షాపులు తెరిచారంటూ వ్యంగ్యంగా అన్నారు. రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం ఇస్తుంటే.. ఓర్వ లేక తమ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయంటూ మండిపడ్డారు. రైతు పండించిన పంటను కొనుగోలు చేస్తున్నామని.. రైతుకు బోనస్ సైతం ఇస్తున్నామని చెప్పారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టుల వల్లే నేడు నల్గొండ జిల్లాకు నీళ్లు వస్తున్నాయని గుర్తు చేశారు. పోరాట యోధులను అందించిన గడ్డ నల్గొండ అని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామని చెప్పిన తమ ప్రభుత్వం చేసి చూపించిందన్నారు. అయితే తమ ప్రభుత్వం రైతు భరోసా ఎగ్గొట్టిందంటూ దుష్ప్రచారం చేశారని ప్రతిపక్షాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ కేవలం తొమ్మిది రోజుల్లోనే రైతులకు రైతు భరోసా నగదు అందించామన్నారు. ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని తెలిపారు. 18 నెలల్లో మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రవేశపెట్టి మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి రూ. 6, 500 కోట్లు ఖర్చు అయిందని వివరించారు. తమ ప్రభుత్వం కొలువు తీరి రెండేళ్లు పూర్తయ్యే సరికి 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. కేసీఆర్ కట్టిన కాళేశ్వరం.. ఆయన హయాంలోనే కూలేశ్వరం అయ్యిందని ఎద్దేవా చేశారు. కూలేశ్వరం ప్రాజెక్టు దగ్గరే వారిని ఉరి తీసినా తప్పు లేదన్నారు. ప్రాజెక్టులపై చర్చకు సిద్ధమా? అంటూ బీఆర్ఎస్ నేతలకు ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. మూడు అడుగులున్న స్థానిక నేత ఎగిరెగిరి పడుతున్నారని ఎద్దేవా చేశారు. పదేళ్లు అవకాశం ఇచ్చినా తుంగతుర్తికి నీళ్లు ఎందుకు తేలేదంటూ మాజీ మంత్రి జగదీష్ రెడ్డిని సీఎం సూటిగా ప్రశ్నించారు. తుంగతుర్తికి నీరు తేవడమంటే.. గ్లాస్‌లో సోడా పోసినట్లు కాదంటూ బీఆర్ఎస్ నేతకు ఈ సందర్భంగా చురకలంటిం చారు. దొర ముందు చేతులు కట్టుకుని గ్లాస్‌లో సోడా పోయడమే నీకు తెలుసంటూ మాజీ మంత్రి జగదీష్ రెడ్డిపై మండిపడ్డారు. సొంత మండలానికి ఎమ్మార్వో, ఎంపీడీవో ఆఫీస్‌లే కాదు.. పోలీస్ స్టేషన్ సైతం తెచ్చుకోలేని ఘనత బీఆర్ఎస్ నేతలదంటూ వ్యంగ్యంగా అన్నారు. . నాడు గంజికి లేని మూడు అడుగుల నాయకుడు.. నేడు బెంజి కార్లలో తిరుగు తున్నారంటూ జగదీశ్వర్ రెడ్డిపై వ్యంగ్య బాణాన్ని సీఎం రేవంత్ రెడ్డి సంధించారు. పదేళ్లు అధికారంలో ఉన్నా పేదలకు రేషన్ కార్డు, సన్నబియ్యం ఇవ్వాలనే ఆలోచన బీఆర్ఎస్ నేతలకు రాలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 3.10 కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ చేశామని.. రేషన్ దుకాణాల వద్ద జనాలు బారులు తీరుతున్నారన్నారు. పంటలకు గిట్టుబాటు ధరతో పాటు బోనస్ ఇచ్చామని.. వ్యవసాయం దండగ కాదు.. పండగలా చేశామన్నారు. దేశం తలెత్తుకునేలా వరి ధాన్యం ఉత్పత్తి చేస్తున్నామని చెప్పారు. రైతు రాజు అయినప్పుడే ఇందిరమ్మ ఆత్మశాంతిస్తుందని ఆసక్తిక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వం సహాయక సంఘాలను పట్టించుకోలేదు. మేము అధికారంలోకి వచ్చిన తరువాత స్వయం సహాయక సంఘాలకు పెట్రోల్ బంకులు అప్పగించాం. ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులు, సోలార్ పవర్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. మూడు అగుడుల వ్యక్తి నన్ను అడ్డుకుంటానని అంటున్నాడు. గ్లాసులో సోడా పోసినంత ఈజీ కాదు.. గోదావరి నీళ్లు తేవడం. ఒక్కసారి అడ్డుకుని చూడు, మా దామన్న చూసుకుంటాడని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ తదతరులు పాల్గొన్నారు.

# రాజకీయ చదరంగంలో బీసీ వర్గాలు పావులేనా?

మొదటిపేజీ తరువాయి..

మరోసారి బీసీల పాలిట త్రిశంకు స్వర్గంగా మారుతుందా? అనే అనుమానాలు చుట్టుముడుతున్నాయి. ప్రధాన రాజకీయ పక్షాల పాచికలో బీసీలు పావులుగా మారుతున్నారనే చర్చసాగుతోంది. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని ఉన్నట్లు కాంగ్రెస్,బీఆర్ఎస్, బీజేపీలతో పాటు ఇతర రాజకీయ పార్టీలు 42శాతం రిజర్వేషన్లకు గట్టి మద్ధతుదారులుగా బల్ల గుద్ది వాదిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండగా, బీఆర్ఎస్ ప్రధాన ప్రతిపక్షంగా ఉంది. బీజేపీ మూడవ పక్షంగా కొనసాగుతోంది. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండగా, ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్ కొనసాగుతోంది. ఈ స్థితిలో రాష్ట్రంలో ఒకరు నిర్ణయం తీసుకుంటే కేంద్రం సహకరిస్తే కావాల్సిన కార్యక్రమం గంధర్వులు చేసినట్లు బీసీల స్థానిక రిజర్వేషన్లకు పెద్దగా అడ్డుపడే శక్తి ఎవరూ లేరు. కానీ, 42 శాతం రిజర్వేషన్ల అమలుపైన ఈ మూడు పార్టీల చిత్తశుద్ధిని కొందరు శంకిస్తున్నారు. మూడు పార్టీల్లో నిజాయితీ ఉంటే, పరస్పర సహకారం తీసుకుని బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసే రాజకీయ నిర్ణయంతో పాటు చట్టసభల్లో అడ్డంకులు, రాజ్యాంగపరమైన ఆటుపోట్లను సులభంగా తొలగించవచ్చు. కానీ, ఒకరిపై ఒకరు రాజకీయ విమర్శలు చేసుకుంటూ సమస్యను జఠిలం చేస్తున్నారు. దీనికి ప్రధాన కారణం మూడు రాజకీయ పక్షాల్లోని బీసీ నాయకులు సంఘటితంగా లేక పోవడం ఒక కారణమైతే, సమిష్టిగా తమ జాతి ప్రయోజనం కోసం పట్టుబిగించక పోవడం మరో కారణంగా చెప్పవచ్చు. ఈ పార్టీల్లోని బీసీ నేతల్లో నిర్ణయాధికార పాత్రలేకపోవడంగా భావిస్తున్నారు. ఇతరుల నాయకత్వంలో పనిచేసే ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులుగా ఉండడం మరో అంశంగా గుర్తుచేస్తున్నారు. ముఖ్యంగా బీసీ సమాజంలోని అనైక్యత, కొందరు సంఘనాయకుల భావదారిద్రానికి తోడు, స్వంత ప్రయోజనం కోసం అందరి ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టే స్వభావం వల్ల తీవ్రమైన ముప్పు నెలకొంటోంది. ముఖ్యంగా బీసీ సమాజం నుంచి రాజకీయ పక్షాలపై బలమైన ఒత్తిడి లేకపోవడం ప్రధాన కారణంగా పరిశీలకులు భావిస్తున్నారు.

**పార్టీలు విమర్శలు, ప్రతివిమర్శలతో రాజకీయ పబ్బం?**

ఈ నేపథ్యంలోనే తెలంగాణంలో పంచాయతీ రాజ్ ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలిప్పుడు ఫలిస్తుందా? తీరా ఎన్నికలనాటికి రిక్త హస్తం చూపెట్టి పాత ధోరణిలోనే ఒక పార్టీపై మరో పార్టీ విమర్శలు, ప్రతివిమర్శలు చేస్తూ తమ రాజకీయ పబ్బంగడుపుకుంటారా? అనే చర్చ తీవ్రంగా సాగుతోంది. ఎందుకంటే బీసీల పట్ల ఈ పార్టీలకు నిజాయితీ ఉంటే ఒకరు తీర్మానం చేస్తే మరొకరు సహకరించే పద్ధతిని అవలంభించి ఉమ్మడి రాజకీయ నిర్ణయంగా చట్ట సభ ల్లో రూపం తీసుకునేందుకు అవకాశం ఉంటుందంటున్నారు. కానీ, ఇప్పటికే అధికార కాంగ్రెస్ పార్టీ కేబినేట్ నిర్ణయం తీసుకుంటే మిగిలిన పక్షాలు సన్నాయి నొక్కులు నొక్కుతున్నాయి. తమ నాయకత్వాలపై ఒత్తిడి తెచ్చి బీసీలకు చట్టబద్ధ అవకాశాలు కల్పించి ఆయా పార్టీల్లో బీసీ నాయకులుగా తమ గౌరవాన్ని, బీసీల గౌరవాన్ని కాపాడుదామనే సానుకూల దృక్పథం కంటే ఈ తంతును ఉపయోగించుకునే బీసీలను తమ ఓటు బ్యాంకుగా మార్చుకుంటూ ప్రత్యర్థిపార్టీని ఇరుకున పెట్టే ప్రయ త్నాలు సాగుతున్నాయి. బీసీ సమూహం వీరికి కర్రుకాల్చివాత పెట్టాలని బీసీ సంఘాల నాయకులు కొందరు ఇప్పటికే విన్నవిస్తున్నారు.

**ఎన్నికల్లో హామీలు తప్ప అమలెక్కడ?**

తెలంగాణ సమాజంలో అధికారిక కుల గణన ప్రకారం 56.33 శాతంగా ఉన్న బీసీలు ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారు. ప్రధానంగా రాజకీయ రంగంలో బీసీల ప్రాధాన్యత అంతంత మాత్రమే. అది కూడా కొన్ని కులాలకే పరిమితమైంది. చట్టసభల్లో వీరి పాత్ర నామమాత్రంగా ఉండగా స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలు చేస్తున్న కాసిన్ని రిజర్వేషన్ల పుణ్యమా అంటూ అక్కడక్కడ మెరుస్తుంటారు. ఎన్నికల ముందుఅన్ని రాజకీయపక్షాలు బీసీలను ఓటుబ్యాంకుగా భావించి వరాలు కురిపిస్తున్నారు. హామీలు అమలు దగ్గరికి వచ్చేసరికి అనేక అడ్డంకులు సృష్టించి మోకాలొడ్డుతున్నారు. దీనికి ముఖ్య కారణం బీసీల్లో అనైక్యత, చైతన్యరాహిత్యం ప్రధాన కారణం కాగా,బీసీ సంఘాలనేతలు సమూహ ఆత్మగౌరవాన్ని తమ స్వార్ధ ప్రయోజనాలకు తాకట్టుపెట్టడం ప్రధాన కారణంగా భావిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరే షన్‌లో బీసీలకు స్థానికసంస్థల ఎన్నికల్లో 42శాతం అమలు చేస్తామని ఇచ్చిన హామీ మేరకు కులగణన చేపట్టి జనాభా 56.33శాతంగా తేల్చింది.

## కాలం కాదు.. కాంగ్రెస్ కాటేస్తోంది

మొదటిపేజీ తరువాయి..

లేదని రైతన్నలు ప్రశ్నిస్తున్నారు. దాదాపు ఆరువందల మీటర్ల ఎత్తున ఎగిసిన కాళేశ్వరం నీళ్లు సుమారు 450 కిలోమీటర్ల దూరం ప్రయాణించి సూర్యాపేట జిల్లాలోని పెన్‌పహాడ్ మండలంలో రావిచెరువు వరకు చేరి రైతుల పొలాలను తడిపిన నీళ్లు నేడెందుకు పారడం లేదని రైతన్నలు ప్రశ్నిస్తున్నారు. శ్రీరాం సాగర్ కింద 2001లో పూర్తయిన కాకతీయ వరద కాలువ 22 ఏళ్ల తర్వాత కాళేశ్వరం ఎత్తిపోతల మూలంగా 153 కిలోమీటర్లు ప్రయాణించి చివరి ఆయకట్టు-కు చేరాయి. కానీ నేడు మేడిగడ్డ మరమ్మతులు చేయకుండా, కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీళ్లు ఎత్తిపోసి సాగునీరు ఇచ్చే అవకాశం ఉన్నా, కాంగ్రెస్ సర్కార్ ఉద్దేశపూర్వక నిర్లక్ష్యంతో అటువైపు కన్నెత్తి చూడడం లేదు. వ్యవసాయంపై కక్షగట్టిన కాంగ్రెస్ సర్కార్ రైతన్నలకు శిక్ష వేస్తున్నది. కాంగ్రెస్ కుట్రలను చేధిస్తాం. తెలంగాణ రైతన్నలను కాపాడుకునేందుకు నిరంతరం పోరాడతాం' అంటూ కేటీఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## జల వివాదంపై కేంద్రం చొరవ

మొదటిపేజీ తరువాయి..

ఢిల్లీ వెళ్లనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆయన అక్కడికి చేరుకోనున్నారు. కేంద్రమంత్రులు అమిత్‌షా, అశ్వినీ వైష్ణవ్, సీఆర్ పాటిల్‌తో సమావేశం కానున్నారు. ఈనెల 17న రాత్రి 9 గంటలకు తిరిగి విజయవాడకు చంద్రబాబు చేరుకోనున్నారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు రెండు రోజులు ఢిల్లీలో పర్యటించనున్నారు. మంగళ, బుధవారాల్లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా పలువురు కేంద్ర మంత్రులతో సీఎం చంద్రబాబు భేటీ- కానున్నారు. రాష్ట్ర ప్రాజెక్టులు, నిధులపై కేంద్ర మంత్రులతో సీఎం చర్చించనున్నారు. మాజీ ప్రధాని పీవీ సంస్మరణ సభ, సీఐఐ బిజినెస్ మీట్‌లో చంద్రబాబు పాల్గొననున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, మంత్రులు అశ్వినీ వైష్ణవ్, సీఆర్ పాటిల్, మన్సుఖ్ మాండవీయ, నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్ తదితరులతో సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటనలో భేటీ కానున్నారు. రాష్ట్రంలో చేపట్టిన ప్రాజెక్టులు, వాటికి అవసరమైన నిధులు, పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు సహా వేర్వేరు అంశాలపై సీఎం కేంద్ర మంత్రులతో చర్చించ నున్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించిన పనుల గురించి కూడా ఆయా మంత్రిత్వ శాఖతో సీఎం చర్చలు చేయనున్నారు.

## నింగికేసి రైతుల చూపు!

మొదటిపేజీ తరువాయి..

మాత్రం మొగులు దిక్కు కొండంత ఆశతో ఎదురుచూస్తున్నారు. నీలి మబ్బుల జల్లుల కోసం నింగిని చూస్తున్న రైతన్నలు

గత ఏడాది సగటు వర్షపాతం923.8 మి.మీకాగా, నైరుతిరుతుపవనాల సాధారణ వర్షపాతం 740.6 మి.మీ ఈ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన జూన్ మొదటి నుంచి నేటివరకు సాధారణ వర్షపాతం185.4 మిమీలు ఉండగా ఇప్పటి వరకు 165.5 మి.మీ మాత్రమే కురిసింది. -11 మి.మీ లోటు నెలకొన్నది. జూన్ నెలలో సాధారణ వర్షపాతం నమోదుకాగా, జూలైలోనే లోటు ఏర్పడింది. ఈ వానకాలంలో నైరుతిరుతు పవనాలు వారంరోజులముందే ప్రారంభమై మురిపించినప్పటికీ తదుపరి ముఖం చాటేశాయి.

**23 జిల్లాలో సాధారణ వర్షపాతం**

23 జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదైంది. 10 జిల్లాలో తక్కువ వర్షాలు కురిశాయి. ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, కరీంనగర్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, మెదక్, సిద్ధిపేట, వరంగల్, హనుమకొండ, ములుగు మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, రంగారెడ్డి, వికారాబాద్, వనపర్తి మహబూబ్ నగర్, నారాయణపేట, నాగర్ కర్నూల్,జోగులాంబ గద్వాల, జిల్లాల్లో సాధారణవర్షపాతం నమోదైంది. మంచిర్యాల,పెద్దపల్లి, సంగారెడ్డి, జయశంకర్‌భూపాలపల్లి, జనగామ, మేడ్చల్, సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి,హైదరాబాద్ జిల్లాల్లోలోటువర్షపాతం నమోదైంది. అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లాలో వర్షాలుపడగా, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో వర్షపాతం అత్యల్పంగా నమోదైంది.

**రైతులు వరి, పత్తి వైపు మొగ్గు**

రాష్ట్రంలో రైతులు ప్రతీ ఏడాది మాదిరిగానే ఈ వానకాలం సీజన్‌లో కూడా వరి, పత్తి వైపు మొగ్గు చూపారు. తగిన వర్షపాతం, నీటి వనరులు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో వరి సాగు చేపట్టగా మిగిలిన వర్షాధారంతో పాటు స్వంత నీటి వనరులు అందుబాటులో ఉన్నప్రాంతాల్లో పత్తి, మొక్కజొన్న, కంది, పెసర పంటలకు ప్రాధాన్యమిచ్చారు.పూర్తి వర్షాధార ప్రాంతాల్లో జొన్న ఇతర మెట్టపంటల వైపు రైతులు మొగ్గు చూపారు. ఇప్పటి వరకు వరి 40,3,109 ఎకరాల్లో, పత్తి 38,34,146 ఎకరాల్లో, మొక్కజొన్న 22,6,054 ఎకరాల్లో, జొన్న 36,008 ఎకరాల్లో, కంది 4,61,432 ఎకరాల్లో, పెసర 6,0548 ఎకరాల్లో సాగు చేశారు. మొత్తం నూనెగింజల సాగు 3,35,550 ఎకరాల్లో,పప్పుధాన్యాలు 5,44,992 ఎకరాల్లో సాగు చేశారు. వరి,బెంగాల్ శెనగ,వేరుశెనగ నువ్వులు,పొద్దుతిరుగుడు, ఆముదం పంటలు 25 సాగు చేశారు.

printed, Published and Owned by GUNTOJU VISHNU MURTHY, Printed at V.M. PRINTERS Plot No : 08, Shiva shankar colony, Kuntloor( vil), Abdulpurmet(mdl), Rangareddy(dist). Telangana. Published at V.M.PUBLICATIONS Plot No : 108, Shiva shankar colony, Kuntloor( vil), Abdulpurmet(mdl),Telangana State. Pin : 501505, Editor : GUNTOJU VISHNU MURTHY, RNI No : APTEL/31957/2009. Cell No : 96765 49223.

NEELAGIRI VARTHA TELUGU DAILY neelagirivartha@gmail.com
నీలగిరి వార్త
తెలుగు దిన పత్రిక
మన కోసం మన వార్త
తెలంగాణ ఉమ్మడి జిల్లాలు
మంగళవారం 15-7-2025




## రోడ్లు దుస్థితి పై జిల్లా ఇన్చార్జి మంత్రిని కలసిన ఎన్జీఓలు



చోడవరం నీలగిరి వార్త ప్రతినిధి

అధ్వాన్న రహదారులు పై జిల్లా ఇన్చార్జి మంత్రి కొల్లి రవీంద్ర ను సోమవారం ఆర్క్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్జీవోలు మచిలీపట్నంలో కలిశారు. చోడవరం బి.ఎన్. రోడ్డు.. దుస్థితి గురించి మంత్రికి తెలియజేశారు. కాంట్రాక్టర్ కు నిధులు విడుదల చెయ్యడం, కొంత ఖర్చుకూడా చెయ్యడం జరిగిందని, ఈ విషయమై ప్రభుత్వం కూడా రోడ్లు పనులు పూర్తి చెయ్యడానికే ప్రయత్నం చేస్తున్నామని మంత్రి తెలిపారు. మరింత త్వరగా పూర్తిచేయడానికి ప్రయత్నం చేస్తామని తెలిపారు. అనకాపల్లి జిల్లా నుండి 10 మంది ఎన్జీలు వెళ్లినట్లు తెలిపారు మంత్రిని కలిసిన వారిలో బద్రి మహంతి వెంకట రావు, కమ్యూనిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అక్కు మహా%శీ%తీ నాగేశ్వర రావు (రాజా), సమన్వయంతో కలిశారు. రోడ్లు పరిస్థితి పై మంత్రి సానుకూలంగా స్పందించారని తెలియజేశారు. చోడవరం కోర్టు లో వేసిన వాజ్యానికి ఈ నెల 26న వాయిదా వుందని తెలిపారు.

## స్వయంభూ కార్యసిద్ధి గణపతి ఆలయంలో సంకష్టహర చతుర్థి వేడుకలు

### భక్తులచే సామూహిక లక్ష్మి గణపతి హెూమం, అన్న సమారాధన



చోడవరం నీలగిరి వార్త ప్రతినిధి

రాష్ట్రంలోని స్వయం భూ దేవాలయాలు అన్నింటిలో అత్యంత మహిమాన్వితమైన, చరిత్ర ప్రసిద్ధి చెందిన అనకాపల్లి జిల్లా చోడవరం స్వయం భూ కార్యసిద్ధి గణపతి దేవస్థానంలో ఆషాడ బహుళ చవితి, సంకట హర చతుర్థి పర్వదినం పురస్కరించుకుని సోమవారం భక్తులు, మహిళలు, పుర ప్రముఖుల చే సామూహికంగా లక్ష్మి గణపతి హెూమం నిర్వహించారు. సర్వ శ్రేయోభివృద్ధికి వేకువ జామునే భక్తులచే మహా గణపతికి పురుష సూక్త విధానంలో పంచామృత అభిషేకములు, గణపతి అధర్వణ శీర్షం తో ప్రత్యేక పూజలు, అనంతరం సామూహిక లక్ష్మి గణపతి హెూమం నిర్వహిం చినట్లు ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచలి చలపతిరావు తెలియజేసారు. అనంతరం హెూమంలో పాల్గొన్న భక్తులకు తిరుపతి గోపికృష్ణ (విశాఖపట్నం) వారి సహకారంతో మహా అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. అనంతరం ఈ.ఓ. అన్నప్రసాద వితరణ దాతను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్వయంభు శివాలయం చైర్మన్ గూనూరు సురేష్, ప్రధాన అర్చకులు కొడమంచలి వెంకట్రావు, కొడమంచలి షణ్ముఖ శాస్త్రి (శ్రీనివాస్), సంగీస విగ్నేష్, మహేష్, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.వి.వి. సత్యనారాయణ మూర్తి, ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పసుమర్తి సాంభశివరావు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## నోట్ పుస్తకాలు పంపిణీ చేసిన తలారి



కొవ్వూరు నీలగిరి వార్త ప్రతినిధి

తాళ్లపూడి మండలం గజ్జరం పేద విద్యార్థులు ఉన్నంత స్థానానికి చేరాలని వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలను వైఎస్ఆర్సిపి పార్టీ ముందుకు తీసుకు వెళుతుందని కొవ్వూరు నియోజకవర్గ వైసిపి ఇన్చార్జి తలారి వెంకటేశ్వరరావు అన్నారు. తాళ్లపూడి మండలం గజ్జరం గ్రామంలో వైయస్సార్ జయంతి వార్షికోత్సవాల చివరి రోజు సందర్భంగా సోమవారం హై స్కూల్లో విద్యార్థులకు స్థానిక నాయకులతో కలిసి నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. తలారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వైయస్సార్ జయంతి వారోత్సవాలు సందర్భంగా ప్రతిరోజు ఒక సేవా కార్యక్రమం చేపట్టామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గజ్జరం సర్పంచ్ గండి రాంబాబు, తాళ్లపూడి మండల పార్టీ అధ్యక్షులు కొలిశెట్టి నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు వేల్లిన శ్రీనివాస్, పిట్ట శ్రీనివాస్, ఊట్ల నంద,సురేష్ రాజా కార్యకర్తలు పాల్గొన్నారు.

## సేంద్రీయ పద్ధతిలో పంటలు అధిక దిగుబడులు

### మండల ఎంపీపీ ఈశ్వరి.

డుంబ్రిగుడ: నీలగిరి వార్త ప్రతినిది

సేంద్రీయ పద్ధతిలో పంటల సాగుకు ఊతమిస్తే అధిక దిగుబడులు సాధ్యపడుతుందని, పనిముట్లతో వ్యవసాయ అభివృద్ధికి తోడ్పాటునిచ్చుకోవాలని ఎంపీపీ ఈశ్వరి అన్నారు. మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో సీపీఎఫ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన ప్రోగ్రాం అధికారిణి ఆచార్య నాగమణి సహకారంతో గిరిజన రైతులకు వ్యవసాయ పనిముట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సేంద్రియ పద్ధతిలో పంటల సాగుకు ఊతమిస్తే అధిక దిగుబడులు సాధ్యపడుతుందన్నారు. ఎంపీడీఓ ప్రేమ్సాగర్ మాట్లాడుతూ సంస్థ సహకారంతో పనిముట్లను వినియోగించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. గిరిజన రైతులకు గాలి పంకాలు, గడ్డీ తీసే యంత్రాలు, డిజిటల్ తూకం, ప్రకృతి వ్యవసాయానికి వినియోగంగా ఉండే స్ప్రేయింగ్లను తూటంగి, లైగండ, గుంటగన్నెల పంచాయతీల 20గ్రామాల గిరిజన రైతులకు పంపిణీ చేశారు. జడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, ఆ సంస్థ ప్రతినిధులు, గిరిజన రైతులు పాల్గొన్నారు.



# మమ్మల్ని ఆపేదెవరు!?

**ఎమ్మెల్యే అండదండలు మాకు ఉన్నాయి!!???**

**మా ఇష్టం తరలిస్తాం ఎవరే పీ.........???**

**విలేకరులు అయితే ఎవరికి గొప్ప...!!??**

**మాకు ఏ అనుమతులు అక్కరలేదు ఎమ్మెల్యే ఆదేశం చాలు!!???**

**విలేకర్లపై తిరగబడుతున్న ట్రాక్టర్, జెసిబి యజమానులు**





చోడవరం నీలగిరి వార్త ప్రతినిధి

మా ఇష్టానుసారం మేము తరలిస్తాం, మాకు ఎవరి అనుమతులు అక్కరలేదు, మీరు అడిగితే మేము చెప్పాలా, మీరు విలేకరులు అయితే మాకేంటి. ఎవరికి గొప్ప. ఎమ్మెల్యే ఆదేశం చాలు ఎవరి అనుమతులు తీసుకోవలసిన పనిలేదు అంటూ అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ జెసిబి యజమానులు విలేకరులపై చిందులు వేసిన సంఘటన అనకాపల్లి జిల్లా చోడవరం మండలంలో చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎటువంటి అనుమతులు లేకుండా చోడవరం మండలంలోని లక్ష్మీపురం చెరువు నుండి మట్టి ట్రాక్టర్లతో తరలిస్తూ జేబులో నింపుకుంటున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నారని తెలిసి విలేకరులు అనుమతులు ఉన్నాయా ఎలా తరలిస్తున్నారు అని అడిగితే పై విధంగా విలేకరులపై చిందులు వేశారు. నెంబర్లు లేని టాక్టర్ల పై డ్రైవింగ్ లైసెన్స్ లేని వారు డ్రైవ్ చేస్తూ మట్టిని తరలిస్తున్నారు. మైనర్లు సైతం డాక్టర్లను రోడ్లపై అతివేగంగా పరుగులు పెట్టిస్తున్నారు. ఏమాత్రం అదుపుతప్పిన ప్రాణాలు పోయే పరిస్థితి అధికంగా ఉంది. మారుమూల ప్రాంతంలో రోడ్లపై అనుకుంటే పొరపాటే. లక్ష్మీపురం నుండి చోడవరంలో నిర్మిస్తున్న ఇళ్లకు, అపార్ట్మెంట్లకు, మట్టిని దర్జాగా జనాల మధ్య అతివేగంగా నడుపుతూ తరలించకపోతున్నారు. ఈ సమస్యపై పలువురు విలేకరుల దృష్టికి తీసుకువెళ్లగా విలేకరులు టాక్టర్లపై మట్టిని తరలించేందుకు అనుమతులు తీసుకున్నారా అని అడిగినందుకు వారిపై తిరగబడి ఎవరు ఏమి చేయలేరు మాకు ఎమ్మెల్యే అండదండలు పుష్కలంగా ఉన్నాయి అధికారులు మమ్మల్ని ఏమి చేయగలరు అనడం చూస్తుంటే వేరే అక్రమ వ్యాపారానికి ప్రజాప్రతినిధులు ఏ విధంగా సహకరిస్తున్నారు ఇట్టే అర్థమవుతుంది. ఈ సంఘటనపై సంఘటన స్థలానికి వెళ్లిన విలేకరులు వీడియోలు తీసి పూర్తి వివరాలు అధికారులకు తెలిపారు. దీనిపై అధికారులు ఏ విధంగా చర్యలు చేసుకుంటారు వేచి చూడాల్సిందే.

## రోగులకు కుళ్ళిన కోడిగుడ్లతో భోజనం

### ఫిర్యాదు చేసిన స్పందించని అధికార యంత్రాంగం



వి మాడుగుల నీలగిరి వార్త ప్రతినిధి

అనకాపల్లి జిల్లా విమాడుగుల ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పెడుతున్న భోజనంలో కుళ్ళిన గుడ్లు పెడుతున్నప్పటికీ అధికారులు స్పందించడం లేదని రోగులు రోగుల బంధువులు ఆరోపిస్తున్నాయి. సోమవారం చోటు చేసుకున్న సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆస్పత్రిలో ఇన్ పేషెంట్లుగా చేరిన వారికి నాణ్యమైన భోజనం అందించాలని ప్రభుత్వం నిధులు కేటాయిస్తుంటే. అధికారుల నిర్లక్ష్యంతో భోజన ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు నాణ్యతలేని భోజనం పెడుతుండడం గమనార్హం. అనారోగ్యాలతో ఆసుపత్రికి చేరిన వారికి నాణ్యత లోపించిన భోజనాలు పెడితే వారి ఆరోగ్యం ఏ విధంగా తయారవుతుందో ఇట్టే ఊహించవచ్చు. గతంలో పలు మార్లు ఇదేవిధంగా జరిగితే సంబంధిత ఆసుపత్రి సిబ్బందికి అధికారులకు తెలిపిన పట్టించుకోలేదని దీంతో నిర్వాహకులు ఆడిందే ఆట పాడిందే పాటగా తమకు నచ్చిన రీతిలో నాణ్యతలేని వంటకాలు వండి రోగులకు పెడుతూ రోగుల ఆరోగ్యాన్ని అనారోగ్యాల పాలు చేస్తున్నారని పలువురు అభిప్రాయాలు వ్యక్తపరుస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం రోగులకు పెట్టిన గుడ్లు కుళ్లిపోయి ఉండటంతో రోగులు ప్రశ్నిస్తే మరో గుడ్డు ఇస్తాం తింటే తినండి లేకపోతే పొండి ఊరికెన పెట్టిన భోజనానికి మీ డిమాండ్ ఏంటి అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని రోజులు ఆవేదన వ్యక్తపరిచారు. దీనిపై అధికారుల స్పందించి రోగులకు నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని రోగులు రోగుల బంధువులు కోరుతున్నారు.

## ఉచిత లంపి స్కిన్ వ్యాధి నివారణ టీకా కార్యక్రమం ఆకస్మిక తనిఖీ



చీడికాడ నీలగిరి వార్త ప్రతినిధి

జూలై 11 నుండి 25 వరకు నిర్వహిస్తున్న ఉచిత లంపి స్కిన్ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమ%శీ% లో భాగంగా కండివరం గ్రామంలో సోమవారం జరుగుతున్న టీకా కార్యక్రమాన్ని మాడుగుల ఏరియా పశు వైద్య శాల సహాయ సంచాలకులు డా. చిట్టి నాయుడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇప్పటివరకు మండలంలో 1240 పశువులకు లంపి స్కిన్ వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పెద గొగాడ డా. మణిలక్ష్మణ్ తెలిపారు. అనంతరం గ్రామీణ పశుగణ కేంద్రం, బైలపుడి జె. బి. పురం రైతు సేవా కేంద్రం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కండివరం పశు వైద్య సహాయకులు సంతోష్, రమేష్, వి.ఎల్.వో మేరీ రత్నం, పశు సంవర్ధక సహాయకురాలు సాయి పాల్గొన్నారు.

## 16 నుంచి కొవ్వూరు మున్సిపల్ కార్మికులు సమ్మె



### కొవ్వూరు పురపాలక సంఘంలో కమిషనర్‌కి నోటీసులు అందజేత

కొవ్వూరు నీలగిరి వార్త ప్రతినిధి

ఆప్కాస్ స్థానంలో ప్రైవేటు ఏజెన్సీలకు అధికారం ఇవ్వాలనే ప్రతిపాదనలు ఉపసంహరించి మునిసిపల్ పారిశుధ్య,ఇంజనీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని వయో పరిమితే 62 ఏళ్లకు పెంచి 17 రోజుల సమ్మె కాలపు రాత పూర్వక ఒప్పందలైన రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఎక్స్ గ్రేషియా 5 లక్షల నుండి 7 లక్షల పెంపుదల,దహన సంస్కరణాలకు 15000 నుండి 20వేలకు పెంపుదలకు సంబంధించిన జీవోలు వెంటనే జారీ చేయాలని ఆప్కాస్ ద్వారా రిటైర్మెంట్ చేసిన దీర్ఘకాలికంగా అనారోగ్యం పాలై మరణించిన కార్మికుల స్థానంలో వారి పిల్లలకు ఉద్యోగాలుఇవ్వాలని మునిసిపల్ పారిశుద్ధ్య ఇంజనీరింగ్ కార్మికుల సేవలను పరిగణలోకి తీసుకుని తల్లికి వందనం పథకంతో సహా ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ షరతులు లేకుండా మున్సిపల్ కార్మికులందరికీ అమలు చేయాలని మున్సిపల్ కార్మికులందరికీ జీవో ఎంఎస్ నెంబర్ 26 ప్రకారం పారిశుద్ధ్య కార్మికులకు ఆదాయ పరిమితో సంబంధం లేకుండా పథకం వర్తిస్తుందని ప్రకటించినప్పటికి కొవ్వూరు పురపాలక సంఘంలో పారిశుధ్య కార్మికులకు అమలు కాలేదని ఈ లోపాన్ని సరిదుద్ది వెంటనే అమలు చేయాలి. తదితర డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసులు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు కొవ్వూరు పురపాలక సంఘం గౌరవ అధ్యక్షులు ఎం.సుందర్ బాబు అధ్యక్షులు భూపతి రవీంద్ర ప్రధాన కార్యదర్శి పి.వాసు కళ్యాణ్ రాజేష్ రాజన్న అప్పారావు ఎం.కిషోర్ మీసాల జ్యోతి కార్మికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జనసేన పార్టీలో జరిగిన పరిమాణాలపై విచారిస్తున్న శివశంకర్



కొవ్వూరు నీలగిరి వార్త ప్రతినిధి

కొవ్వూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్చార్జి టీవీ రామారావు ని ఇటీవల పార్టీ అధిష్టానం ఇన్చార్జి బాధ్యతలుబి నుంచి తొలగించారు. ఈ నేపథ్యంలో కొవ్వూరు నియోజకవర్గం జనసేన పార్టీలో జరుగుతున్న విషయాలపై పార్టీ అధిష్టానానికి సమగ్ర నివేదిక ఇచ్చేందుకు జనసేన పార్టీ ఏపీ ఎంఎస్ ఎంఈ డిసి చైర్మన్ జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివ శంకర్ రావు సోమవారం కొవ్వూరు జనసేన పార్టీ కార్యాలయానికి విచ్చేశారు. టీవీ రామారావు పార్టీ నాయకులతో ఒక్కొక్కరితో విడిగా మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా శివ శంకర్ రావు మాట్లాడుతూ కొవ్వూరు నియోజకవర్గం లో పార్టీలో ఉన్న పరిస్థితులపై పూర్తి విచారణ చేశాక పార్టీ అధిష్టానికి నివేదిక ఇస్తామని తెలిపారు.

# ప్రధానోపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలి

### విద్యా కమిటీ ఛైర్మన్ నాగూర్ ఖాన్ వెల్లడి







**మార్కాపురం జులై 14,నీలగిరి వార్త: ప్రతినిధి తిప్పన బోయిన మల్లికార్జున,**
విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మెను సక్రమంగా అమలు చేయని మార్కాపురం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురా లు శ్రీదేవి పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకువాలని పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ నాగూర్ ఖాన్ సోమవారం ఆరోపించారు.స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ను సోమవారం సందర్శించి రికార్డు లు పరిశిలించారు.802 మందికి మధ్యాహ్న భోజనం వండటానికి120 కిలోల బియ్యం ఇవ్వాలని కేవలం 70 కిలోల బియ్యం మాత్రమే ఇచ్చారని తెలిపారు. గుడ్లుకూడా450 మాత్రమే ఇచ్చారని తెలిపారు. రికార్డు లు పరిశీలిస్తే 120 కిలోల బియ్యం..450 గుడ్లు ఇచ్చినట్లు రికార్డు లో రాసారని తెలిపారు. తనముందే రికార్డు లు తారుమారు చేసినట్లు వెల్లడించారు.
పాఠశాల లో ఆర్ఓ ప్లాంట్ పనిచేయడం లేదు.దీంతో విద్యార్థులు పాచిపట్టిన వాటర్ ట్యాంక్ నీళ్ళు తాగి వ్యాధులకు గురవుతున్నారు అని తెలిపారు.ఈ ప్రధానోపాధ్యాయురాలు పై అధికారులు సమగ్రంగా విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

# జాతీయ రహదారి పై రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి






**మార్కాపురం , జులై 14,నీలగిరి వార్త: ప్రతినిధి తిప్పన బోయిన మల్లికార్జున :**

ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం మిట్టమీదపల్లె గ్రామ సమీపంలో సోమవారం అమరావతి అనంతపురం జాతీయ రహదారిపై మార్కాపురం వెళ్తున్న ఓ కారు అతి వేగంగా వెళ్తూ రహదారిపై ఉన్న గేదెలను ఢీకొట్టి పల్టీలు కొట్టింది. దీంతో మార్కాపురం నుండి కంభం వైపు వస్తున్న ద్విచక్ర వాహనంను కూడా కారు ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరు వ్యక్తులు అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. . అక్కడి పరిస్థితిని గమనించిన కారులో ప్రయాణిస్తున్న వాళ్లు అక్కడి నుండి కారు ఆపకుండా పరారీ అయ్యారు. స్థానికంగా ఉన్న వాళ్లు మార్కాపురం పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతి చెందిన వారు%జ% అర్ధవీడు మండలం రంగాపురానికి చెందిన ఆకవీటి విజయ్, మరొకరు బొల్లుపల్లికి చెందిన బెజవాడ దావీదు గా స్థానికులు తెలిపినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# నోవా ఆసుపత్రి సేవలను సద్వినియోగం చేసుకోండి

### ప్రారంభోత్సవంలో నిర్వాహకులు అహ్మద్, అబ్దుల్ రౌఫ్



**నీలగిరి వార్త నారాయణఖేడ్ జూలై 14 :**
నోవా ఆసుపత్రిలో అందించనున్న ప్రత్యక ఎముకల చికిత్స సేవలతో పాటు మెరుగైన వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నోవా ఆసుపత్రి నిర్వాహకులు అహ్మద్, అబ్దుల్ రౌఫ్, ఓంప్రకాశ్ అన్నారు. సోమవారం నారాయణఖేడ్ పట్టణంలోని శివాజీ చౌక్ వద్ద నోవా ఆసుపత్రిని నిర్వాహకుల తల్లిదండ్రులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆసుపత్రిలో డాక్టర్ సుదర్శన్ వెద్దేమని ఎం.బి.బి.ఎస్, ఎం.ఎస్ ఆర్థోపెటిక్ అన్ని వెళ్లలో అందుబాటులో ఉంటారన్నారు. ప్రత్యక ఎముకల చికిత్సతో పాటు మోకాళ్ళ నొప్పులకు పి.ఆర్.పి ఇంజక్షన్ చేయబడును, అపెండెక్స్, హర్నియా, హిస్టరెక్టమి, హైడ్రోసిల్, కాలిన గాయాలు, పాము కాటుకి మరియు విషం తాగిన వారికి చికిత్స, ఎముకల వైద్య సేవలు నడుమునొప్పి, మెడ నొప్పి, సయాటికా, కీళ్లనొప్పులు, మడిమ నొప్పి, కండరాల నొప్పులు, కీళ్లవాతం, విరిగిన ఎముకలకు ఆపరేషన్ చేయడం జరుగుతుందన్నారు. కావున ఈ అవకాశాన్ని నారాయణఖేడ్ నియోజకవర్గం ప్రజలతో పాటు పక్క రాష్ట్రాలయిన కర్ణాటక, మహారాష్ట్ర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబసభ్యులతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# పీ ఎం జన్ మన్ పథకాలు పనులు వేగవంతం చేయండి

### కేంద్ర గిరిజన వ్యవహారాల కార్యదర్శి విభు నాయర్





**పాడేరు నీలగిరి వార్త బ్యూరో**
కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీ ఎం జన్ మన్ పథకాల పనులను వేగంగా పూర్తి చేయాలని కేంద్ర గిరిజన వ్యవహారాల కార్యదర్శి విభు నాయర్ అన్నారు. సోమవారం డిల్లీ నుండి జిల్లా కలెక్టర్లు, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారులు, ఐసిడిఎస్, వైద్య ఆరోగ్య శాఖ, గృహ నిర్మాణం, పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగాల ఆధ్వర్యంలో జరుగు తున్న పథకాల పురోగతిపై సమీక్షించారు. అంగన్వాడీ భవ నాలు, గృహ నిర్మాణాలు, జల్ జీవన్ మిషన్ లో చేపట్టిన తాగునీటి పథకాలు, రహదారుల నిర్మాణాలు, బహాళార్ధక భవన నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. అంగన్వాడీ భవనాలను 2026 మార్చి నాటికి పూర్తి చేయాలని సూచిం చారు. అది కర్మయోగి కార్య క్రమాలను క్షేత్ర స్థాయిలో అమలు చేయాలన్నారు. వీటికి అవసరమైన మాస్టర్ ట్రైనర్లను ఎంపిక చేయాలని సూచించారు.
జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ పి ఎం జి ఎస్ పై మొదటి దశలో 85 రోడ్లు మంజూరయ్యాయని, 43 పనులు పురోగతిలో ఉన్నాయని వివరించారు. రెండవ దశలో 61 పనులు మంజూరు కాగా 21 పనులు టెండరు దశలో ఉన్నాయని చెప్పారు. 118 అంగన్వాడీ భవనాలు మంజూరయ్యామన్నారు. 53 హాస్టల్ భవనాలు మంజూరయ్యని పేర్కొన్నారు. అభివృద్ధి పనులు అన్నింటి నవంబరు నాటికి పూర్తి చేస్తామన్నారు.
ఆది కర్మయోగి ప్రోగ్రాం అములకు కార్యచరణ ప్రణాళికలు జిల్లాలోని 420 గ్రామ సచివాలయాల పరిధిలో ఆది కర్మయోగి ప్రోగ్రాం అమలు చేయడానికి సమగ్రమైన కార్యచరణ ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్సు హాలులో పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమం, గ్రామీణ నీటి సరఫరా విభాగం, ఐసిడి ఏస్, డి ఆర్ డి ఏ, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో పి. ఎం. జన్. మన్ పథకాలు అమలు, ఆది కర్మయోగి ప్రోగాంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైట్ హౌస్ విధానానికి రూప కల్పన చేయాలన్నారు. దీని ద్వారా విద్య వైద్యం ఆరోగ్యం, అంగన్వాడీ సేవలు సక్రమంగా అందించడానికి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. యువతకు శిక్షణలు, సామర్థ్యాలు పెంపు, ఇంటర్నెట్ సదుపాయాలు, సృజనాత్మకత పెంపొందించడం వంటి కార్యక్రమాలు అమలు చేయాలన్నారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. ఎం. జె. అభిషేక్ గౌడ, జిల్లా వ్యవసాయా ధికారి ఎస్ బి ఎస్ నంద్, జిల్లా ఉద్యానవన అధికారి ఎ.రమేష్ కుమార్రావు, డి ఆర్ డి ఏ పి డి వి.మురళి, డివిజనల్ పంచాయతీ అధికారి ఎస్.బి. ఎస్ .నంద్, పంచాయతీ రాజ్ ఇ ఇ టి. కొండయ్య పడాల్, జిల్లా వైద్యా ఆరోగ్యశాఖాధికారి టి.విశ్వేశ్వరనాయడు పాల్గొన్నారు.

# పీ4 సర్వేపై ఈనెల 15 నుండి పునఃధృవీకరణ

### జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమా ఆదేశాలు జారీ





**పాడేరు నీలగిరి వార్త బ్యూరో**
పేదరికంలేని సమాజ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వర్ణాంధ్ర 2047 పీ 4 సర్వేపై రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో ఈ నెల 15 వ తేదీన నుండి 25 వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా పునఃధృవీకరణ సర్వే ప్రక్రియ చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ ఆదేశాలు జారీ చేసారు. ఈ మేరకు ఈనెల 11 వతేదీ ఒక మండల స్థాయి కమిటీని ఏర్పాటు చేసామని సోమవారం ఒక ప్రకటనలో తెలియ జేసారు. కమిటీ సభ్యులు గ్రామ, వార్డు స్థాయిలో పర్యటించి గత మార్చి నెలలో జరిగిన పీ 4 సర్వేలో గుర్తించిన బంగారు కుటుంబాల పరిశీలించిన జాబితాను పునఃపరిశీలన చేయాలని ఆదేశించారు. అనంతరం జాబితాను సంబంధిత గ్రామ సచివాలయం,పంచాయతీ కార్యలయాలలో ప్రచురించాలని ఆదేవించారు.

**మండల స్థాయి కమిటీ ఏర్పాటు**
మండల ప్రత్యేకాధికారి చైర్పర్సన్, ఎంపిడి ఓ కన్వీనర్ గాను, తాహశీల్దారు, మండల విద్యాశాఖాధికారి, సహాయ ఇంజనీర్ (పి ఆర్, ఆర్ డబ్లూ ఎస్, రహదారులు భవనాలు, గిరిజన సంక్షేమం, గృహనిర్మాణ శాఖ), వైద్యాధికారి, ఎంపిపి, జెడ్ పి టిసి, స్వచ్ఛంద సంస్థలు, ట్రస్టు వంటి సంస్థల ప్రతినిధులు సభ్యులుగా సర్వే ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తారని పేర్కొన్నారు. పీ 4 సర్వే ప్రక్రియను నిర్దేశించిన గడువులో పునఃపరిశీలన చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు.

# పేదరికం లేని సమాజాన్ని నిర్మించాలి: జిల్లా కలెక్టర్

**పాడేరు నీలగిరి వార్త ప్రతినిధి**
రాష్ట్ర ప్రభుత్వం ఆశయాల మేరకు బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని పేదరికం లేని సమాజాన్ని నిర్మించాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ స్పష్టం చేసారు. ఫీ2 4 విధానం అమలుపై సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. సందర్భంగా మాట్లాడుతూ పేదలకు ఆర్థిక సహాయ మాత్రమే కాదు విద్య, వైద్య రంగాలలో సహాయం అందించాలని చెప్పారు. ఉపాధ్యాయులు ముఖ్యంగా ఈ ఆయన బంగారు కుటుంబాల విద్యార్థులను దత్తతీసుకోవాలని సూచించారు. అభివద్ధికి తోడ్పాటు అందించాలని స్పష్టం చేసారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదలకు అందించి పేదరిక నిర్మూలనకు కృషి చేయాలాన్నరు. సేదకలు సహాయం చేయడానికి మార్గదర్శిలను గుర్తించాలన్నారు.
ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రభుత్వోద్యోగులు, వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు, కాంట్రాక్టరులు పేదరిక నిర్మూలనకు తోడ్పాటు అందించాలని చెప్పారు. పీ 4



సర్వేకు మండల స్థాయిలో కమిటీలనునియమించామన్నారు. కమిటీలు సక్రమంగా సర్వేచేసి బంగారు కుటుంబాలను గుర్తించి ధృవీకరించాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. ఎం. జె. అభిషేక్ గౌడ, ఐటిడిఏ పి ఓలు, కె. సింహ చలం, అపూర్వ భరత్, సిపి ఓ పి. ప్రసాద్, జల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి టి. విశ్వేశ్వరనాయుడు డివిజసల్ పంచాయతీ అధికారి పి. ఎస్.కుమార్, 22 మండలాల తాహశీల్దారులు, ఎంపిడిఓలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేదలకు అందేనా?

### వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పోసనబోయిన హుస్సేన్.

**నీలగిరి వార్త,హుజూర్ నగర్**
సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గ, మండల పరిధిలోని శ్రీనివాసపురం గ్రామంలో నిర్వహిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సమావేశం తంగెళ్ల గోపరాజు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పోసనబోయిన హుస్సేన్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ అట్టడు వర్గాల హక్కుల కోసం కూలి పెంచాలని,భూమి పంచాలని,జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని పరిరక్షించాలని, నిరంతరం అనేక పోరాటాలు నిర్వహిస్తూ వ్యవసాయ కార్మికులకు,పేదలకు అండగా నిలుస్తుందని, అన్నారు.1936లో ఏర్పడిన వ్యవసాయ కార్మిక సంఘం గ్రామీణ స్థాయిలో పెత్తందార్లు కొనసాగిస్తున్న ఆర్థిక దోపిడీకి,శ్రమ దోపిడీకి,సామాజిక అణిచివేతకు, కుల వివక్షతకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు నిర్వహించిందని తెలిపారు.దేశ వ్యాప్తంగా మిగులు భూములను పేదలకు పంచాలని,పోరాడి భూమిలేని పేదలకు లక్షలాది ఎకరాల భూమిని పంచిన చరిత్ర వ్యవసాయ కార్మిక సంఘానికి ఉందని అన్నారు.
స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ ఇంకా అనేక మందికి ఇండ్లు,ఇండ్ల స్థలాలు,దున్నుకొని జీవించడానికి సెంట్ భూమి కూడా లేని వారు లక్షలాదిగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కేంద్రంలోని బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ నిరుద్యోగాన్ని పెంచు తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు హుస్సేన్.ఎన్నో పోరా టాల ఫలితంగా వచ్చిన గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేయాలనే కుట్రలో భాగంగా ప్రతి బడ్జెట్లో నిధులు తగ్గిస్తూ కొత్త కొత్త జీవోలు తెచ్చి ఉపాధికి ఉరి పెడుతుందని విమర్శించారు. మరోవైపు నిత్యవసర వస్తువుల ధరలు పెంచి,ప్రజా పంపిణీ వ్యవస్థనే లేకుండా చేయాలని చూస్తుందని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని అన్నారు.వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రూ12,000 వేల రూపాయలు వెంటనే ఇవ్వాలి అన్నారు.గ్రామాలలో పనులు లేక వ్యవసాయ కూలీలు వలసలు వెళ్లి బ్రతకవలసిన పరిస్థితి ఏర్పడిందని, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలపైన రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న భూ సమస్యలపైన పోరాటాలను సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు నూకల లక్ష్మీనరసింహ,వ్యవసాయ కూలీలు నూకల అంజయ్య,సైదిరెడ్డి,బానోతు చందా,నంది రాములమ్మ, నంది తిరపమ్మ, అన్నపూర్ణ,నూకల శేషమ్మ, జింకల భాగ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.



# హెచ్ఎం ను విచారించి హెచ్ఎం తీరుపై ఆగ్రహం వ్యక్త పరిచిన సబ్ కలెక్టర్



**మార్కాపురం జులై 14, నీలగిరి వార్త: ప్రతినిధి తిప్పన బోయిన మల్లికార్జున :**
విద్యా కమిటీ ఛైర్మన్ పటాన్ నాగుర్ ఖాన్ చేసిన ఆరోపణలకు స్పందించిన అధికారులు, సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాధ్ మరియు తాసిల్దార్ చిరంజీవి పాఠశాలలను తనిఖీ చేపట్టారు.మార్కాపురం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పై విద్య కమిటీ ఛైర్మన్ చేసిన అవినీతి ఆరోపణల నిమిత్తం, వెంటనే స్పందించిన అధికారులు, అవినీతి విచారణలో భాగంగా తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్, తహసిల్దార్, విద్యాశాఖ అధికారులు పాఠశాలకు చేరుకొని హెచ్ఎం శ్రీదేవి అవినీతిపై విచారిస్తున్నారు. ఏమి జరుగుతుందో అధికారికంగా పూర్తి వివరాలు ఉన్నత అధికారులు వెల్లడి చేయాల్సివుంది.

# చంద్రమౌళీశ్వరుడికి పుష్పాభిషేకం



**నీలగిరి వార్త నారాయణఖేడ్ జూలై 14:**
నారాయణఖేడ్ మండలం వెంకటాపూర్ చౌరస్తాలో గల శ్రీ భక్త మార్కండేయ ఆలయంలో సోమవారం చంద్రమౌళీశ్వరుడికి ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రత్యేక అభిషేకం, మహహారతి నిర్వహించగా మహిళలు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులు చంద్రమౌళీ శ్వరుడికి పుష్పార్చన,హనుమాన్ చాలీసా,గీతా పారాయణం,లలితా సహస్ర నామావళి కార్యక్రమాలు కొనసాగించారు.కాగా ప్రతి సోమవారం భక్త మార్కండే ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు పద్మశాలి కుల బాంధవుల ఆధ్వర్యంలో,భక్తుల సమక్షంలో వైభవంగా నిర్వహిస్తున్నారు.కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం శ్రీ భక్త మార్కండేయ ఆలయం వద్ద అట్టహాసంగా భజన కార్యక్రమం నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం సత్తేగామా గ్రామ పద్మశాలి కుల బాంధవుల ఆధ్వర్యంలో అన్నదాన ప్రసాద కార్యక్రమం చేపట్టారు.ఇట్టి కార్యక్రమంలో భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నూతన తహసిల్దార్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకులు



**ఎల్కతుర్తి నీలగిరి వార్త ప్రతినిధి**
హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసిల్దార్ ప్రసాద్ రావు నీ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించిన యూత్ కాంగ్రెస్ హుస్నాబాద్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల చైతన్య మరియు యూత్ కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా మాజీ జనరల్ సెక్రటరీ మంద సుమన్ గౌడ్.

# ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పై దాడిని ఖండిస్తున్నాం...

### .బీసీ సంఘం నల్గొండ జిల్లా అధ్యక్షులు సురేష్ యాదవ్‌లి.....

**నీలగిరివార్త /జులై 14/ నల్గొండ జిల్లా ప్రతినిధి: శంకర్**



...హైదరాబాద్లోని మేడిపల్లి లో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పై అతని %ు% న్యూస్ ఆఫీసు పై దాడి చేసిన జాగృతి కార్యకర్తలు ఎమ్మెల్సీ కవిత అనుచరుల మీద తక్షణమే పోలీస్ శాఖ వారు కఠిన మైన చర్యలు తీసుకోవాలని బీసీ సంఘం నల్గొండ జిల్లా అధ్యక్షులు సురేష్ యాదవ్ సోమవారం ఒక ప్రకటన లో డిమాండ్ చేసారు. క్యూ న్యూస్ ఆఫీసు పై జాగృతి కార్యకర్తలు దాడి చేసి చేయడమే కాకుండా అక్కడ ఉన్నటువంటి సిబ్బందిని బయ భ్రాంతులకు గురి చేశారని తెలిపారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పై దాడి తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బడుగు బలహీన వర్గాల గొంతుక అయిన న్యూస్ ఛానల్ పై అంటే 2 కోట్ల మంది బీసీల మీద దాడి చేయడమేనని పేర్కొన్నారు.

# చేయూత పెన్షన్ వెంటనే ఆరు వేల రూపాయలు ఇవ్వాలి

**ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్చార్జ్ గద్దం కాశం**

**యాతాకుల రాజన్న మాదిగ ఎంఎస్ పి జిల్లా అధ్యక్షులు**

**ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల జిల్లా ఇన్చార్జి బచ్చలకూరి వెంకటేశ్వర్లు .**



నీలగిరి వార్త, సూర్యాపేట:-
సూర్యాపేట జీవీ ఫంక్షన్ హాల్ లో విహెచ్పిఎస్ జిల్లా సదస్సు చింత సతీష్ వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు అధ్యక్షతన జరిగింది . ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి జిల్లా ఇన్చార్జి బచ్చలకూరి వెంకటేశ్వర్లు మాదిగ వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా ఇన్చార్జి గద్దం ఖాసిం ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు యాతాకుల రాజన్న మాదిగ సంయుక్తంగా మాట్లాడుతూ మహా జననేత మానవతా ఉద్యమాల పితామహుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో గత 30 ఏళ్ల సామాజిక ఉద్యమంలో భాగంగా వృద్ధులు వితంతువులు, వికలాంగులు ఒంటరి మహిళల పెన్షన్ల పెంపు కోసం ఉద్యమిస్తూ గతంలో 50 రూపాయల పెన్షన్ నుంచి నేడు 2000, 4000 సాదించామని, భవిష్యత్తులో రేవంత్ రెడ్డి ఇచ్చిన ఎన్నికల మేనిఫెస్టోలో చేయూత పెన్షన్ల పెంపు వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ టి ఆర్ వి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ నయీమ్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు చింత వినయ్ బాబు ,ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సమన్వయకర్త చింతలపాటి చిన్న శ్రీరాములు మాదిగ, రాష్ట్ర నాయకులు ఎర్ర వీరస్వామి మాదిగ కనుకుంట్ల వెంకన్న మాదిగ, ఎం ఇ ఎఫ్ రాష్ట్ర కోశాధికారి చింత జాన్ విల్సన్ మాదిగ, జాతీయ నాయకులు కర్ల విజయరావు, రాష్ట్ర మహిళా నాయకురాలు రావి స్నేహలతచౌదరి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి జహీర్ బాబా, జిల్లా అధికార ప్రతినిధి పేరెల్లి బాబు, పేర్ల సోమయ్య, గుండు శ్రీనివాస్, నూకపంగు గురవయ్య, ఇంద్రాల పిచ్చయ్య, కర్నాటిజయకృష్ణ , బిక్షపతి ,గిరి , బిక్షపతి బోలికొండ వెంకన్న , దున్నపోతుల కార్తీక్ , సపవత్తుసాగర్, రూపా రాణి చింత సైదమ్మ యశోద రేణుక, దారమళ్ళ నగేష్, కొప్పుల కళింగ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఆర్జీలను సత్వరమే పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**





కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త: సుందర్:
ప్రజావాణి ఆర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా ఐడిఓసి లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్ నాయక్‌లతో కలిసి ప్రజల నుండి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ ప్రజావాణి కార్యక్రమానికి 95 అర్జీలు వచ్చినాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ ప్రజావాణి ఆర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి శనివారంలోగా దరఖాస్తులను పరిష్కరించి ఆర్జి దారులకు న్యాయం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కౌన్సిల్‌లో ప్రస్తావించిన సమస్యల పరిష్కారం పై శ్రద్ధ చూపండి

**బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్.**



వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.
కౌన్సిల్ లో ప్రస్తావించిన సమస్యల పరిష్కారం పై శ్రద్ధ చూపాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం అనంతరం నిర్వహించిన గ్రీవెన్స్ ఫిర్యాదుల సమీక్ష పై నిర్వహించిన సమావేశంలో కమిషనర్ అధికారులకు తగు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్లు వివిధ సమస్యల నిమిత్తం అధికారులకు ఫోన్ చేసే క్రమంలో అధికారులు స్పందించాలని, ఇటీవల శానిటేషన్ టౌన్ ప్లానింగ్ ఇంజనీరింగ్ విభాగాలలో బదిలీలు జరిగిన క్రమంలో అంతర్జాలంలో అట్టి సమాచారాన్ని సవరించాలని, గ్రీవెన్స్ కు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారంలో అట్టి సమస్య గురించి క్షేత్రస్థాయిలో అధికారులు సందర్శించి పరిశీలన చేసి పరిష్కరించిన తర్వాతనే డాష్ బోర్డు నుండి తొలగించాలని, సెల్ఫ్ అసెస్మెంట్ లు మ్యుటేషన్ లకు సంబంధించి కనీసం 5% క్షేత్ర స్థాయి లో తనిఖీలు చేయాలని అన్నారు.ఈ సందర్భం గా టౌన్ ప్లానింగ్ ఇంజనీరింగ్ శానిటేషన్ మలేరియా విభాగాలకు సంబంధించి గత ప్రజావాణి కార్యక్రమం లో స్వీకరించిన ఫిర్యాదులు ఎంతవరకు పరిష్కారం అయ్యాయి ఎందుకు చేయలేకపోయారు అనే విషయాలను అడిగి తెలుసుకొని వేగవంతం గా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి డి ఎఫ్ ఓ శంకర్ లింగం వెటర్నరీ వైద్యులు డా.గోపాల్ రావు పన్నుల అధికారి రామకృష్ణ ఇన్చార్జి ఎస్ ఈ, సిటీ ప్లానర్ లు మహీందర్ రవీందర్ రాడేకర్ హెచ్ ఓ లు రమేష్ లక్ష్మారెడ్డి డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి ఎం హెచ్ ఓ డా.రాజేష్ హెచ్ ఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పబ్లిక్ టాయిలెట్స్‌ను ప్రారంభించిన న్యాయమూర్తులు





**బొడ్డు బిక్షపతి గౌడ్**

హయత్ నగర్ నీలగిరి వార్త
గత 20 సంవత్సరాల నుంచి హయత్ నగర్ కోర్టులో ప్రజలకు అందుబాటులో లేని టాయిలెట్స్ ను ఈరోజు నూతనంగా ఆధునికరించి హయత్ నగర్ కోర్ట్ న్యాయ మూర్తులు ప్రారంభించినారు. గత 20 సంవత్సరాలుగా హయత్ నగర్ కోర్టులో ప్రజలకు టాయిలెట్స్ అందు బాటులో లేని కారణంగా చాలా రకాలుగా ఇబ్బందులు పడ్డారని అట్టి ఇబ్బందులను అధిగమించి ఈరోజు ప్రజల కొరకు హయత్ నగర్ కోర్ట్ బార్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో టాయిలెట్స్ ను ఆధునీకరించి ప్రారంభించడం జరి గిందని న్యాయమూర్తులు తెలిపినారు. కావునా ఈ టాయి లెట్స్ ను కాక్షిదారులు వినియోగించు కోవలసినదిగా వారు కోరినారు. ఈ కార్యక్రమములో హయత్నగర్ కోర్టు %ఇఅజ% వ మెట్రోపోలీటన్ మేజిస్ట్రేట్ సల్మాఫాతిమా గారు, %జఅఅ% వ మెట్రోపోలీటన్ మేజిస్ట్రేట్ ఫారహీన్ బేగం గారు, హయత్నగర్ కోర్టు అధ్యక్షులు మోడెమ్ ప్రభాకర్ గౌడ్, హయత్నగర్ కోర్టు మాజీ అధ్యక్షులు మరియు టీపీసీసీ లీగల్ సెల్ రంగా రెడ్డి జిల్లా ఛైర్మెన్ బొడ్డు బిక్షపతి గౌడ్, ఉపాధ్యక్షులు మేకల సతీష్, ప్రధాన కార్యదర్శి బండి నరేష్, ఆటలా కార్యదర్శి సింగపంగు రాజేష్, గ్రంధాలయ కార్యదర్శి ఈసారపు సైదులు, కార్యవర్గ సభ్యులు వినుకొండ శృతి, ఈపూరు పద్మ, వేదం సాయికృష్ణ, మసీదు శివ, పొట్లపల్లి యాదయ్య, కోర్టు సూపరింటెండెంట్లు దార రాములు, శారదా, అజాం మరియు అధిక సంఖ్యలో న్యాయవాధులు, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది మరియు కాక్షిదారులు పాల్గొన్నారు.

# శ్రీ భగవతి రేణుక ఎల్లమ్మ తల్లి నల్ల పోచమ్మ తల్లి బోనాల జాతర: బేరి రామచంద్ర యాదవ్

శేరిలింగంపల్లి నీలగిరి వార్త ప్రతినిధి
నేతాజీ నగర్ కాలనీలో జులై 20వ తేదీ ఆదివారం నాడు శ్రీ భగవతీ రేణుక ఎల్లమ్మ నల్ల పోచమ్మ ఆలయంలో బోనాల పండుగ నిర్వహించడం జరుగుతుందని కాలనీ అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి నేతాజీ నగర్ కాలనీలో ఉన్న ప్రతి ఇంటి నుండి రెండు బోనాలు ఒకటి రేణుక ఎల్లమ్మ తల్లికి రెండవది నల్ల పోచమ్మ తల్లికి సమర్పించుకోవాలని తెలిపారు. స్వయంభుగా వెలసిన శ్రీ భగవతి రేణుక ఎల్లమ్మ తల్లి నల్ల పోచమ్మ తల్లులకు మనస్ఫూర్తిగా నియమనిష్ఠలతో బోనాలు సమర్పించుకొని ఆ దేవతల కరుణ కృపా కటాక్షాలు పొందాలని అన్నారు. ఆ తల్లి కృపకు మీరు పాత్రులైతే విద్యావంతులవుతారు ఆరోగ్యవంతులవుతారు వృత్తులపరంగా అభివృద్ధి చెందుతారు పాడిపంటలు ఘనంగా పండుతాయి వ్యాపారం అంతకంతకు అభివృద్ధి చెందుతుంది అని అన్నారు. కాలనీలో ఉన్న ప్రజలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆ తల్లి కృపకు పాత్రులు కావాలని అన్నారు. ఆలయ కమిటీ సమావేశంలో పాల్గొన్న కాలనీ పెద్దలు, మహిళా సోదరీమణులు మరియు యువజన నాయకులు ఆలయ కమిటీ సభ్యులు కే నరసింహా యాదవ్ రవి నాయక్,



రాయుడు, జయ రెడ్డి, రాధారాన్ రెడ్డి, లాల్ రెడ్డి, అన్నదొర ప్రసాద్ చారి, అంజిరెడ్డి, గంగమ్మ, సత్తెమ్మ, మనీ మేఘమాల, రాములు నాయక్, నరేష్ నాయక్, సురేష్ నాయక్, దశరథ్ నాయక్, గణేష్ నాయక్, రాజు నాయక్, విట్టల్ నాయక్, డీజే భువన్, లవణాచారి, అశోక్, భేరి రామచందర్ యాదవ్

# స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో గులాబీ జెండా ఎగరాలి




**- మళ్లీ కెసిఆరే కావాలంటున్న ప్రజలు**

**- రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి**

**పంజుగుల శ్రీశైల్ రెడ్డి.**

తాండూరు / జూలై 14 :
స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడైనా రావచ్చు అని కార్యకర్తలందరూ ఐక్యమత్యంగా ఉండి ఎన్నికలకు సిద్ధం కావాలని పంజుగుల శ్రీశైల్ రెడ్డి గారు పిలుపునిచ్చారు. సోమవారం తాండూర్ పట్టణంలోని మాజీ శాసనసభ్యులు పైలెట్ రోహిత్ రెడ్డి నివాసం నందు గల పార్టీ కార్యాలయంలో తాండూర్ మండల కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయడం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ పల్లెకు వెల్లిన, ఏ వాడకు వెళ్ళినా మళ్లీ కెసిఆర్ సారే ముఖ్య మంత్రి కావాలంటున్నారని అన్నారు. తమకు సమయానికి రైతుబంధు వేయాలని వేడుకుంటున్నారు. కనీసం 30% మంది రైతులకు కూడా రుణమాఫీ చేయలేదన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గులు వేస్తే 15000 తీసుకుంటున్నారు. అన్నిట్లో కమిషన్ దందా నడుస్తున్నదని మండిపడ్డారు.ఈ మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏ గ్రామంలో కూడా అభివృద్ధి చేయడం లేదని మండిపడ్డారు. అబద్ధపు హామీలతో అధికారంలో వచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడైనా రావచ్చని బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ శ్రేణులను బలపరిచేందుకు కృషి చేయాలి అన్నారు.కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉండి ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలు తెలుసుకొని వారికి అండగా నిలవాలని అలాగే పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.నాయకులంతా సమన్వయంతో పనిచేసి పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం అహర్నిశలు కృషి చేయాలన్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ జండా ఎగరవేయడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. మండల పార్టీ అధ్యక్షులు వేరేందర్ రెడ్డి, తాండూరు మండల మాజీ ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు మరియు (బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ) అధ్యక్షులు తాండూర్ నియోజకవర్గ మహిళా కన్వీనర్ మరియు యువజన విభాగం నాయకులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దిష్టిబొమ్మ దగ్ధం

**వికారాబాద్ జిల్లా తీన్మార్ మల్లన్న టీం అధ్యక్షులు ఘనపురం శ్రీనివాస్**

నీలగిరి వార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి
తెలంగాణలోని సబండ బీసీ వర్గాల కోసం పోరాడుతున్న తీన్మార్ మల్లన్న పై , తీన్మార్ మల్లన్న కార్యాలయం పై ఆదివారం ఉదయం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో వారి అనుచరులతో తీన్మార్ మల్లన్న పై దాడి చేయడం జరిగింది, ఈ విషయంపై వికారాబాద్ జిల్లా తీన్మార్ మల్లన్న టీం అధ్యక్షులు ఘనపురం శ్రీనివాస్ ,ఆధ్వర్యంలో జిల్లాలోని ఎన్టీఆర్ చౌరస్తాలో కల్వకుంట్ల కవిత దిష్టిబొమ్మను దగ్ధం చేసి కల్వకుంట్ల కవితకు వ్యతిరేకంగా నినాదాలు చేయడం జరిగింది అనంతరం తీన్మార్ మల్లన్న టీం వికారాబాద్ జిల్లా అధ్యక్షులు ఘనపురం శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీల సబ్బండ వర్గాల కోసం పోరాడుతున్న తీన్మార్ మల్లన్న పై, మల్లన్న కార్యాలయం క్యూ న్యూస్ ఆఫీస్ పై కల్వకుంట్ల కవిత తెలంగాణ జాగృతి అనుచరులతో , గతంలో నయీం ముఠాలో పనిచేసినటువంటి కొందరు వ్యక్తులచే మల్లన్నను హతమార్చేందుకు ప్రయత్నం చేసిన సందర్భంలో, చాకచక్యంగా మల్లన్నకు ప్రాణాపాయం నుండి రక్షించేందుకు మల్లన్న గన్మెన్లు వ్యవహరించిన తీరుని, ప్రశంసించారు, తీన్మార్ మల్లన్న మాట్లాడిన మాటలలో తప్పేమీ లేదని కంచం పొత్తు,మంచం పొత్తు, అనే పదాలకు, మీ నాన్నను అడిగి అర్థాలు తెలుసుకో , తెలంగాణ ఇతిహాసం తెలుకోవాలని ,కనీస అవగాహన లేక అవగాహన రాహిత్యంతో దాడులకు పాల్పడితే ఊరుకునేది లేదని,మీ పార్టీలో నీకు మనుగడ లేక, నిన్ను ఎవరు పట్టించుకోవడంలేదని



నీ మనుగడ కోసం ఇలాంటి అసాంఘిక చర్యలకు పాల్పడితే, ఊరుకునేది లేదని, తీన్మార్ మల్లన్న అంటే ఏమిటో మీ నాన్నని అడిగి తెలుసుకొ ఇంకొకసారి ఇలాంటి దాడులకు పాల్పడితే నీ అంతు చూస్తామని , రాష్ట్రంలో ఎక్కడ తిరిగిన అడ్డుకొని తీరుతామని ఖబర్దార్ కవిత అని హెచ్చరించారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న కల్వకుంట్ల కవిత శాసనమండలి సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి గారికి విజ్ఞప్తి చేయడం జరిగింది. కవిత చరిత్ర తెలుసుకుని మాట్లాడాలి . కానీ తెలంగాణలో ప్రతిదానికి , మండలికం ఇతిహాసాలు ఉంటాయి వాటిని చాలా సందర్భాల్లో తెలంగాణ పౌరులు ఉపయోగిస్తుంటారు. ఏదేమైనా మరో మారు తీన్మార్ మల్లన్న పై అవాకులు ఉత్సవాకులు మాట్లాడితే దాడి చేయించాలని ప్రయత్నం చేస్తే ఖబర్దార్ అని వికారాబాద్ జిల్లా అధ్యక్షులు ఘనపురం శ్రీనివాస్ హెచ్చరించారు ఈ కార్యక్రమంలో పరిగి నియోజకవర్గం ఇంచార్జ్ వేమన్న , వికారాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ జగదీష్ చారి , వికారాబాద్ మండల అధ్యక్షులు ఏం సంతోష్ , నవబు పెట్ అధ్యక్షులు కె.హరీష్ ,ఫయాజ్ , కార్తీక్ , మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

# 17న తాండూరులో కారంచేడు దళిత మృత వీరుల సంస్మరణ సభ

**- కే ఎన్ పి ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏర్పుల చంద్రప్ప**

తాండూరు / జులై 14 :



ఈనెల 17న తాండూరులో కారంచేడు దళిత మృత వీరుల సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు కే ఎన్ పి ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏర్పుల చంద్రప్ప తెలిపారు. తాండూర్ పట్టణంలోని కోడంగల్ రోడ్డు మార్గంలో మేస్త్రీ రాములు కాంప్లెక్స్లో సమావేశం నిర్వహి స్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశానికి ముస్లిం వెల్ఫేర్ అసోసి యేషన్ అధ్యక్షులు కమల అత్తర్, బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు రాజ్ కుమార్, సిపిఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్, పిడి ఎస్ యు జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, జయరాజ్, అభినవ్, అంజిలప్ప తదితర కుల సంఘాల నాయకులు హాజరవుతున్నట్లు తెలి పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలు, దళిత, బహుజన, ప్రజా సంఘాలు విరివిగా హాజరుకావాలని కోరారు.

# బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బహు జన గణ మన పుస్తకావిష్కరణ



దేవరకొండ ప్రజా సింగిడి ప్రతినిధి
ప్రముఖ సాహితీ వేత్త జూలూరు గౌరీ శంకర్ దీర్ఘ కవిత అయినటువంటి బహుజన ఘన మన పుస్తకాన్ని స్వర్ణకార సంఘం గౌరవ సలహాదారుడు చేపూరి జగన్ చారి బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక టీటీడీ కళ్యాణమండపంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జూలూరు గౌరీ శంకర్ బీసీల ఐక్యత సంక్షేమం అణచివేత పై ఆయన పుస్తకం ఆలోచింప జేస్తుందని తెలిపారు తెలిపారు. ఈ కార్యక్రమంలో చొల్లేటి భాస్కరాచారి శ్రీరామోజు శ్రీనివాస చారి, చేపూరి భీష్మ చారి, తదితరులు పాల్గొన్నారు.

# తీన్మార్ మల్లన్న పై దాడి హేయమైన చర్య

**గుర్రపు పెద్దకొల్ల జై కుమార్ ముదిరాజ్**




నీలగిరి వార్త ఎల్లారెడ్డి:
ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై మరియు అతని కార్యాలయంపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని భారత చైతన్య యువజన పార్టీ (బీసీవైపి) 2023 ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గుర్రపు పెద్దకొల్ల జై కుమార్ ముదిరాజ్ పేర్కొన్నారు.సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ దాడి వెనుక ఎమ్మెల్సీ కవిత అనుచరులు, జాగృతి కార్యకర్తలు ఉన్నారని ఆరోపించిన ఆయన, ఇది కేవలం మల్లన్నపై కాకుండా బీసీ సామాజిక వర్గంపై జరిగిన దాడిగా భావిస్తున్నామని అన్నారు. ప్రజాస్వామ్య విలువలను బలహీనపరిచే ఇలాంటి హింసాత్మక చర్యలను తాము ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించమని పేర్కొన్నారు.కంచం పొత్తు, మంచం పొత్తు.... అనే సామెతను తప్పుగా అర్థం చేసుకుని భౌతిక దాడులకు దిగడం సరికాదని, సందేహాలుంటే వివరణ కోరడం ప్రజాస్వామ్య దారి అని స్పష్టం చేశారు. దాడిలో పాల్గొన్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా బీసీవైపి నాయకులు జై కుమార్ ముదిరాజ్ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, గుయ్య సాయికృష్ణ యాదవ్ జగిత్యాల జిల్లా ఇన్చార్జి, కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, రెబ్బాస్ హరీష్ యాదవ్, మార్గం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# పేకాట రాయుళ్లు అరెస్టు



ఇల్లందు నీలగిరి వార్త ప్రతినిధి:
పట్టణంలోని స్టేషన్ బస్తీ ఏరియాలో సోమవారం విశ్వసనీయ సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టుకున్న వారిలో గూగులోత్ రమేష్, రఘువర్మ, చలపతి, ఉపేందర్ ఉండగా మరో నలుగురు పరారీలో ఉన్నట్లు తెలిపారు. అరెస్ట్ అయిన వారి వద్ద మూడు సెల్ ఫోన్లు, రూ. 4150 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## జూలూరు గౌరీ శంకర్ బహు జన గణ మన పుస్తకావిష్కరణ



దేవరకొండ నీలగిరి వార్త

శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ ప్రముఖ సాహితీవేత్త జూలూరు శంకర్ దీర్ఘ కవిత అయినటువంటి బహుజన ఘన మన పుస్తకాన్ని సోమవారం శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం కమిటీ దేవాలయ గౌరవ అధ్యక్షులు చేపూరి జగన్ చారి ఆధ్వర్యంలో పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూటికి 100% జనాభా ఉన్న బీసీలు, రాజ్యాంగ దిశగా వెళ్లకపోవడానికి అగ్రకులాలే కారణమని తెలిపారు. ఆయన పుస్తకంలో బీసీల ప్రాముఖ్యతను ఓటు బ్యాంకు రాజకీయాలకు బీసీలు బలైన విధానాన్ని వివరిస్తూ పుస్తకంలో రాయడం జరిగిందని తెలిపారు. ఇంకా ఎన్నాళ్ళు బీసీలు వెనుకబాటుకు గురవుతారని రాబోవు రోజుల్లో బీసీ ఉద్యమానికి నడుం బిగించాల్సినటువంటి అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. జూలూరు గౌరీ శంకర్ రచనలో వచ్చిన ఈ పుస్తకాన్ని దేవరకొండ పట్టణంలోని బీసీ కులాలతో పాటు స్థానిక ఎం కె ఆర్ డిగ్రీ కళాశాల శాఖ గ్రంథాలయంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో. దేవాలయ గౌరవ అధ్యక్షులు చేపూరి జగన్ చారి, అధ్యక్షులు చోల్లేటి భాస్కరాచారి ప్రధాన కార్యదర్శి శ్రీరామోజు శ్రీనివాస చారి , కోశాధికారి మహేశ్వరం వేణుగోపాల చారి, మనమయ సంఘం అధ్యక్షుడు ఎన్ చారి, గౌరవ సలహాదారులు చేపూరి భీష్మాచారి, చేపూరి నరసింహ చారి, బీసీ సంఘం బ్రహ్మచారి కర్ణ కంటి లక్ష్మణాచారి , చొల్లేటి మణికంఠ చారి ,ఆలయ ప్రధాన అర్చకులు చేపూరి గోవర్ధన చారి రాసమల్ల నాగయ్య, మాకం చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానంతో మరో నిండు ప్రాణాన్ని కాపాడుదాం

**జనచైతన్య ట్రస్ట్.**

నీలగిరి వార్త, హుజూర్ నగర్



సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలోని ఒక వైద్యశాలలో సోమవారం చంద్రు నాయక్ అనే పేషెంట్ కి ఏబి పాజిటివ్ రక్తం తక్కువగా ఉంది అత్యవసరంగా కావాలని భూక్యా కోటేష్ జనచైతన్య ట్రస్ట్ నిర్వాహకులు పారా సాయి,పిల్లి శివశంకర్ లకు సమాచారం ఇవ్వడంతో వెంటనే స్పందించిన జనచైతన్య ట్రస్ట్ సభ్యులు ఏబీ పాజిటివ్ బ్లడ్ గ్రూప్ డోనర్ జనిగ వినయ్ యాదవ్ తో మాట్లాడి వైద్యశాల వద్దకు పంపి రక్తదానం చేయించటం జరిగింది.

ఈ సందర్భంగా జనచైతన్య ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ రక్తదానం అనేది చాలా గొప్ప పనని,మనం రక్తాన్ని సృష్టిం చలేమని,దానం మాత్రమే చేయగలమని,ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ సంవత్సరానికి రెండు,మూడు పర్యాయాలు రక్తదానం చేయొచ్చు అని అన్నారు.చేస్తున్న రక్తదానం ఎంతోమంది ప్రాణాలను కాపాడుతుందని, రక్తదానం చేసి ఆపదలో ఆదుకున్న జనిగ వినయ్ యాదవ్ కి హృదయ పూర్వక అభినందనలు తెలిపారు.రక్త దానానికి కుల,మత బేధం లేదని, ప్రజలకు,యువతకు రక్తదానం చేయడం పట్ల ఇంకా అవగాహన కల్పిస్తూ, ప్రోత్సహిస్తూ ముందుకు సాగుతామని జనచైతన్య ట్రస్ట్ సభ్యులు అన్నారు. ఈ కార్యక్రమంలో జనచైతన్య ట్రస్ట్ అధ్యక్షులు పారా సాయి, ఉపాధ్యక్షుడు పిల్లి శివశంకర్,ట్రస్ట్ సభ్యులు రమేష్, జయంత్,కాశీ విశ్వనాథ్,కె.సాయి,గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యకు పరిష్కారానికి పిఏఆర్టియు ముందుంటుంది

**నల్గొండ ఖమ్మం వరంగల్ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి**



దేవరకొండ నీలగిరి వార్త

తెలంగాణలో అతిపెద్ద ఉపాధ్యాయ సంఘం పి ఆర్ టి యు టిఎస్ మాత్రమేనని నల్గొండ ఖమ్మం వరంగల్ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి అన్నారు . పి ఆర్ టి యు టీఎస్ సభ్యతల నమోదు కార్యక్రమంలో భాగంగా సోమవారం దేవరకొండకు రావడంతో పిఆర్టియు శ్రేణులు జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఘనంగా స్వాగతం పలికి శాలువతో ఘనంగా సన్మానించారు . ఈ సందర్భంగా జరిగిన కార్యవర్గ సమావేశంలో ఎమ్మెల్సీ పింగళి శ్రీ పాల్ రెడ్డి హాజరై మాట్లాడుతూ పి ఆర్ సి మంచి ఫిట్ మెంట్ ఇప్పించేందుకు కృషి చేస్తానని గురుకుల పాఠశాలల టైం టేబుల్స్ మార్పిస్తానని తెలిపారు వారం లోపల జిహెచ్ఎం ప్రమోషన్స్ ఇస్తానని పేర్కొన్నారు అనంతరం ముదిగొండ ఆశ్రమ పాఠశాలలో నీ విద్యార్థినిలకు ఫుడ్ పాయిజన్ కావడంతో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వెళ్లి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో ఆయన వెంట పిఆర్టియు రాష్ట్ర అధ్యక్షులు బి లక్ష్మణ్ ,జిల్లా అధ్యక్షులు మేకల జానారెడ్డి, ప్రధాన కార్యదర్శి దారం దామోదర్, అధ్యక్షులు లోక్యనాయక్ , క్రాఫ్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం .క్రాంతి, కాలం నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడ తిప్పాపూర్ లో కూల్చివేత పనుల పరిశీలన: కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

నీలగిరి వార్త వేములవాడ ప్రతినిధి



వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ లో నిర్మాణాల కూల్చివేత పనులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలించారు. తిప్పాపూర్ ఆర్టీసీ బస్ స్టాండ్ ఎదురుగా ఉన్న పలు నిర్మాణాలను అధికారులు సోమవారం ఉదయం కూల్చి వేయిస్తుండగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాసితులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంతో భక్తులు, ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని వివరించారు ఇచ్చట మున్సిపల్ కమిషనర్ అన్వేష్ పలు విభాగాల అధికారులు సీఐ వీరప్రసాద్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మీయ అభినందన సన్మానం





నీలగిరి వార్త ,హుజూర్ నగర్

సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలోని ప్రజా భవన్ లో స్పందన నాట్య కళామండలి అధ్యక్షుడు కొట్టు లక్ష్మీనారాయణ బాబు ఆధ్వర్యంలో గిన్నిస్ బుక్ రికార్డ్ అవార్డ్ గ్రహీత, ప్రముఖ కళాకారుడు డాక్టర్ గుంటి పిచ్చయ్య ను సోమవారం ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో స్పందన నాట్య కళా మండలి గౌరవ అధ్యక్షుడు గొట్టే వెంకటరామయ్య,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున రావు పాల్గొని మాట్లాడుతూ తెలంగాణలో కళలు,కళాకారులు ఐదు శతాబ్దాలుగా నాటకాలతో ప్రజలలో మార్పులు తీసుకొచ్చారని, మనో వికాసానికి కళలు ఎంతో ప్రాధాన్యత ఇస్తాయని అన్నారు. హుజూర్ నగర్ నియోజకవర్గంలో అనేక మంది కళాకారులు రాష్ట్ర,జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు సంపాదించడం గర్వకారణమని,పౌరాణిక, జానపద, చారిత్రక,సాంఘిక నాటికలు, నాటకాలు ఏకపాత్రాభినయాలు,నృత్య రూపకాలు,నృత్యాలు అనేక ప్రదేశాలలో ప్రదర్శించి అవార్డులు,రివార్డులు పొంది పేరు ప్రఖ్యాతలు సంపాదిస్తూ ఇటీవల గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ లో విజేతగా నిలిచిన సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గం మఠంపల్లి మండల కేంద్రానికి చెందిన కళా ప్రపూర్ణ నట శ్రీ డాక్టర్ గుంటి పిచ్చయ్యకు స్పందన నాట్య కళా మండలి పుష్ప కిరీటం,శాలువా, మెడల్,షీల్డ్ తో పాటు సన్మాన పత్రం అందజేసి ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో ధూళిపాళ రామ కృష్ణప్రసాద్, గోపనబోయిన వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ బలరాంరెడ్డి,ప్రముఖ కళాకారులు కంబాల శ్రీనివాస్,ధర్మారి వెంకటేశ్వర్లు, దొంతగాని సత్యనారాయణ,గోపు చెలినమ్మ, సోమగాని రామన్న, కోలా శ్రీనివాస్,చిలకరాజు లింగయ్య, కొట్టు రాము ,వేల్పుల మోష,ఇందిరాల శ్రీనివాస్, అనేకమంది కళాకారులు పాల్గొన్నారు.

## మండల సభ్యత్వ నమోదు కార్యక్రమానికి హాజరైన నల్గొండ ఖమ్మం వరంగల్ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి



**ఘన స్వాగతం పలికిన పి ఆర్ టి యు టి ఎస్ మండల నాయకులు**

**ఘనంగా సన్మానించిన పి ఆర్ టి యు టి ఎస్ మండల అధ్యక్ష నాయకులు**

**ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి**

దేవరకొండ నీలగిరి వార్త

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పిఆర్సి మంచి ట్రీట్మెంట్ గురుకుల పాఠశాలల టైం టేబుల్స్ మార్పిస్తానని ఖమ్మం వరంగల్ నల్లగొండ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి అన్నారు.దేవరకొండ మండలం పి ఆర్ టి యు టి ఎస్ సభ్యతంలో భాగంగా సోమవారం ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వంతో చర్చించి పరిష్కరిస్తానని చెప్పారు . ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తాను మొదటి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు గురుకుల పాఠశాలలో టైం టేబుల్ పిఆర్సి మంచి ఫీట్ మెంట్



ఇప్పించడం కోసం తన శాయశక్తుల కృషి చేస్తానని పేర్కొన్నారు. జిహెచ్ఎం ప్రమోషన్స్ ఇప్పించడంలో ప్రభుత్వంతో చర్చించి తాను ప్రయత్నం చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను ఉపాధ్యాయ సంఘం నాయకులు శాలువతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు గుండు లక్ష్మణ్ , జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల జాన్ రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి , జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర) ప్రధానోపాధ్యాయులు సిహెచ్ శ్రీనివాస్ , మండల అధ్యక్షులు కొర్ర లోక్య నాయక్, ప్రధాన కార్యదర్శి దారం దామోదర్, బక్కయ్య, నారాయణ సింగ్ ,గాదె వెంకట్ రెడ్డి ,విజయ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, నాగమణి ,కళ్యాణి, లక్ష్మయ్య, అశోక్ ,లక్ష్మయ్య, క్రాంతి కుమార్ ,వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపిది పోరు బాట తెలంగాణ ప్రజలు బిజెపి వైపు చూస్తున్నారు

**ప్రజల ఆకాంక్ష నెరవేర్చే విధంగా పని చేస్తాము**

**తెలంగాణ రాష్ట్ర బిజెపి నూతన అధ్యక్షులు రామచంద్ర రావు**

నీలగిరి వార్త, సూర్యాపేట:-

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి మెజారిటీ స్థానాలు గెలుచుకుంటుందని బిజెపి రాష్ట్ర నూతన అధ్యక్షులు రామచంద్ర రావు అన్నారు. సోమవారం సాయంత్రం సూర్యాపేట జిల్లా కేంద్రంలో బాలాజీ గార్డెన్స్ లో రాష్ట్ర ఉపాధ్యక్షులు సంకినేని వెంకటేశ్వర రావు అధ్యక్షతన జరిగిన సూర్యాపేట జిల్లా స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలు బిజెపి చూస్తున్నారని, ప్రజలు బిజెపి బిజెపి అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బిజెపికి నాయకులు కార్యకర్తలు పని చేయాలని, ఇకపై బిజెపిది పోరుబాటని ఆయన అన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని, హామీలు అమలు చేసే విధంగా ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున నిదులు ఇస్తుందని, అనేక పథకాలు కేంద్ర ప్రభుత్వం ద్వారానే అమలు జరుగుతున్నాయని ఆయన చెప్పారు. రేషన్ బియ్యంలో కేంద్ర ప్రభుత్వమే ఇస్తుందని సన్నబియ్యం ఇచ్చిన ఘనత నరేంద్ర మోడీదని, ఈ సందర్భంగా చెప్పారు. ప్రతి రేషన్ దుకాణాల వద్ద నరేంద్ర మోడీ ఫోటో ఖచ్చితంగా పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామాలలో రోడ్లు, మున్సిపాలిటీలో అమృత పథకం ఇంకా అనేక అభివృద్ధి కార్యక్రమాల్లో నిధులు, రైల్వే లైన్లు జాతీయ రహదారులు,నూతన రైల్వే స్టేషన్లు, వందే బారత్ రైళ్లు ఇలా అనేక అభివృద్ధి పథకాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ములుగులో గిరిజన యూనివర్సిటీకి, వరంగల్‌లో విమానాశ్రయం కేంద్రం ఏర్పాటు చేస్తుందని రామగుండం ఎరువుల ఫ్యాక్టరి , బీబీనగర్ లో ఏయిమ్స్ కేంద్రం ఏర్పాటు చేసిందని ఆయన చెప్పారు . ప్రతి ఒక్క కార్యకర్త కూడా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు బిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీలతో విసిగిపోయారని బిజెపి ప్రభుత్వం వైపు చూస్తున్నారని, రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడితే డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పడుతుందని కేంద్రం నుంచి నిధులు పెద్ద ఎత్తున వస్తాయని ఈ సందర్భంగా అన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా పోరాటాల జిల్లా చైతన్యవంతమైన జిల్లా తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ జిల్లా ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారని అన్నారు. తెలంగాణలో బిజెపి 40 లక్షల సభ్యత్వాన్ని కలిగి ఉన్న రాజకీయ పార్టీ అని ఉమ్మడి నల్గొండ జిల్లా 2 లక్షల సభ్యత్వం కలిగి ఉందని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు బిజెపి సంపూర్ణ మద్దతు ప్రకటించిందని ఆ రిజర్వేషన్లకు కేవలం బీసీలకు ఇవ్వాలని అంతేగాని అందులో 10% ముస్లింలకు ఇవ్వడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని అటువంటి ప్రయత్నాలను బిజెపి అంగీకరించబోదని ఆయన అన్నారు. మతపరమైన రిజర్వేషన్లకు బిజెపి ఎల్లప్పుడు వ్యతిరేకంగా వుంటుందని ఆయన తెలియజేశారు. కాబట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సూర్యాపేట పట్టణంలో బిజెపి నాయకులు భారీ ర్యాలి నిర్వహించారు. రామచంద్ర రావును గజమాలతో సన్మానించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీ లత రెడ్డి, రెడ్డి, మాజి ఎంపి బూర నర్సయ్య గౌడ్, మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, ప్రభారి రాజమౌళి, పోరెడ్డి కిషోర్ రెడ్డి, జుట్టు కొండ సత్యనారాయణ, కడియం రామచంద్రయ్య, కర్నాటి కిషన్, సలిగంటి వీరేంద్ర, చలమల్ల నర్సింహ, మరియు పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





## ఆశ్రమ పాఠశాల విద్యార్థినీలకు మెరుగైన వైద్యం అందించాలి

**టిఆర్ఎస్వి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేముల రాజు**



దేవరకొండ నీలగిరి వార్త

దేవరకొండ మండల పరిధిలోని ముదిగొండ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరిగి అస్వస్థతకు గురై దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినీలను టిఆర్ఎస్వి నాయకులతో కలిసి బిఆర్ఎస్వి రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి వైద్యులను ఆయన కోరారు.. రాష్ట్రంలో సంక్షేమ రంగం మొత్తం కూడా భ్రష్టు పట్టిపోయిందని విద్యాశాఖ మంత్రి లేకపోవడం వల్ల విద్యారంగంలో ఉన్నటువంటి గురుకుల, ఆశ్రమ , వసతి గృహాలు,ప్రభుత్వ పాఠశాలలు మరియు అన్ని రకాల విద్యాసంస్థలలో కనీస పర్యవేక్షణ లోపించడంతో విద్యార్థుల పరిస్థితి అగమ్య గోచారంగా తయారైందని గతంలో జరిగినటువంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## ముదిగొండ ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్



దేవరకొండ నీలగిరి వార్త

దేవరకొండ మండలంలోని ముదిగొండ ఆశ్రమ బాలికల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కావడంతో 12 మంది విద్యార్థినిలకు సోమవారం వాంతులు విరోచనాలు కడుపు నొప్పితో దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఆశ్రమ పాఠశాలలో ఆదివారం రాత్రి బగారా చికెన్ రైస్ వండి పెట్టారని సోమవారం ఉదయం పులిహోర తిన్న విద్యార్థినిలు అస్వస్థత గురయ్యారని తెలిసింది . వీరిని ఉదయం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా వైద్యులు పరీక్షలు నిర్వహించి ప్రమాదం లేదని తెలిపారు.

## మూసి బీసీ గురుకుల ప్రిన్సిపాల్‌గా వంటేపాక సుధాకర్



దేవరకొండ నీలగిరి వార్త

మూసి బిసి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గా వంటేపాక సుధాకర్ సోమవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. మూసి జూనియర్ కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకులుగా పనిచేస్తూ నేడు పదోన్నతి పై మూసి బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గా నియమితులైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రిన్సిపాల్ గా తనపై మరింత బాధ్యత పెరిగిందని పాఠశాల అభివృద్ధి విద్యార్థుల భవిష్యత్తు కోసం సహ ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు .ఈ సందర్భంగా నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపాల్ ను పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## సంకటహరచతుర్థి



వార్త ఉమ్మడి జిల్లా ప్రతినిధి రాజ్...

కామారెడ్డి పట్టణ కేంద్రంలో పశ్చిమ హౌసింగ్ బోర్డ్ కాలనీలో14-7-2025 సోమవారం రోజున స్వయంవర-పార్వతీ పంచ దుర్గాపరమేశ్వరి -దీపనమస్కార ఆరాధన మహోత్సవము. ఉభయజగద్గురువులసంపూర్ణఆశీరనుగ్రహములతో వేద మూర్తులు బ్రహ్మశ్రీ గంగవరంవిజయ-ఆంజనేయ శర్మ గురు దంపతుల మార్గదర్శనంలో సంకష్టచతుర్థి రోజు తెలంగాణ కాణిపాక వినాయకుడిగాప్రసిద్ధిగాంచి,కోరినకోరికలుతీర్చి, ఆనంద శాంతి సుఖ సంతోషజీవనాన్ని ప్రసాదించే శ్రీసంకష్ట హరమహా గణపతికి, ఉ:-5గంకుసుప్రభాతసేవ ,శాంతిమంత్ర పాఠము, ప్రాతఃకాలపూజ, హారతిమంత్రపుష్పము, భక్తులకు గణపతి నిజరూపసందర్శనము. 11గంలకు సహస్రమోదకగణపతి హవనము.సా:-6:30గంకుగణపతికి ఫలపంచామృతాభిషేకము, విశేషాలంకరణ,బ్ర,శ్రీరాచర్ల-రవిచంద్రశర్మగారిద్వారా, సౌభాగ్య సిద్ధి, సమస్తవృత్తివ్యాపారదృష్టిదోషపరిహారముకొరకు,దీప-దుర్గా పరమేశ్వరి పూజా-దీపనమస్కారములు.. అర్చకులు, స్థానికవేద పండితులచే, మహానీరాజనము, మంత్రపుష్పము, వేదాశీర్వచనము. తీర్థప్రసాదఅన్నప్రసాదవితరణము దేవాలయకమిటీ, మహిళా భక్తసమాజంసేవలతో అత్యంతఘనంగా జరుగును. ఆస్తికులైనభక్తులు తప్పకదర్శించి, ఈమహదవకాశాన్నిసద్వినియోగించుకుని, తరించప్రార్థన. ఈపూజ గురించిన మంచి సమాచారాన్ని,మీకుతెలిసిన,బంధుమిత్రులకుగ్రూపులకుపంపగలరు. అందరూబాగుండాలి అందులోమనంఉండాలిలిఆహ్వానించువారు. గంగవరం ఆంజనేయ శర్మ అర్చకులుయజ్ఞంసంపత్ కుమార్ శర్మ. కార్యదర్శి బొంబోతుల రవికుమార్ గౌడ్. కోశాధికారి బెల్దెవిశ్వం గుప్త.

